


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | మంగళవారం | 20-10-2026 | సంపుటి: 3 | సంచిక: 256 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 20-10-2026 | VOLUME : 3 | ISSUE : 256 | PAGES: 8 | COST: 2/- |




## విజయదశమి శుభాకాంక్షలు

రాజముద్ర న్యూస్ పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులు, మిత్రులకు దసరా శుభాకాంక్షలు..

దసరా రోజు మంగళవారం మా కార్యాలయానికి సెలవు. బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

- ఎడిటర్



## తెలంగాణలో దసరా పండుగకు విశిష్టమైన స్థానం : కేసీఆర్

2





## అంతర్జాతీయ స్థాయిలో
# సమ్మిట్ ఏర్పాట్లుండాలి

- స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి
- నవంబరు నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లు పూర్తి చేయాలి
- ఫ్యూచర్ సిటీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19 :

అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో సోమవారం పర్యటించిన ఆయన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు 15 రోజుల

మిగతా 2వ పేజీలో..

## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక

2

- ప్రజలకు రేవంత్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు

## ఎల్‌నినోపై కేబినెట్ సబ్‌కమిటీ..
# భట్టికి కీలక బాధ్యతలు

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- సభ్యులుగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి, సీతక్క, తుమ్మల, శ్రీహరి
- సాగు, తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం కొరతపై ప్రత్యేక దృష్టి
- కరవు పరిస్థితుల ఎదుర్కొనేందుకు రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోరిన రాష్ట్రం

3



## డీజీపీ కార్యాలయంలో ఆయుధ పూజ

హైదరాబాద్, అక్టోబర్ 19:

డీజీపీ కార్యాలయంలో డీజీపీ సి.వి. ఆనంద్ దుర్గాపూజ, ఆయుధ పూజను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీ మహేష్ భగవత్, ఏఐజి అడ్మిన్ రమణ కుమార్, స్టోర్స్ డీఎస్పి, సీ ఎస్ఓతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సబ్ ప్లాన్ నిధుల వ్యయంలో
# వేగం పెంచాలి

- సంస్కరణలు, వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై ప్రత్యేక దృష్టి
- నిధుల వినియోగ పురోగతిపై శాఖల వారీగా డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

3



## 14 నెలల ఆహార భద్రతకు ప్రణాళిక

- ఎల్నినో ముప్పు నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత
- రేషన్ ద్వారా గోధుమ పిండి సహా నిత్యావసరాల పంపిణీపై పరిశీలన: మంత్రి ఉత్తమ్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 19:

ఎల్నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావం, పంట నష్టాలు, ఆహార ధరల పెరుగుదలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పౌరసరఫరాలు, నీటిపారుదల

మిగతా 2వ పేజీలో..



## మహేష్, పొంగులేటి, వంశీకృష్ణలకు
# లీగల్ నోటీసులు

- కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారన్న ప్రచారంపై
- బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌చార్జి భరత్ కుమార్ నోటీసుల జారీ

2



## పారదర్శక రెవెన్యూ సేవలు

- రైతులకు చట్టబద్ధంగా భూ హక్కులు
- రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతో భూవివాదాల శాశ్వత పరిష్కారం
- భూభారతితో ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం
- 34 నెలల్లో 12.40లక్షల పాస్పుస్తకాల జారీ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 19:

ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతా 2వ పేజీలో..

## ఫార్మా ల్యాబ్‌ల ముసుగులో
# డ్రగ్స్ తయారీ..

- హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు
- నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు విస్తరించిన మాదకద్రవ్యాల నెట్‌వర్క్

2





## కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత
# నీటిని మళ్లించాలి

- నవంబర్లోగా ఈ పని పూర్తికావాలి
- లేకపోతే కన్నెపల్లి పంప్ హౌజ్ వద్ద ధర్నా
- మేడిగడ్డను చూపి రైతులకు నష్టం చేయొద్దు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

2

## సింగరేణి అధికారులకు
# దసరా కానుక

- కోలిండియా తరహా వేతనాల పెంచుతూ ఉత్తర్వులు
- అధికారుల విజ్ఞప్తిని నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సెప్టెంబర్ 25 నుంచి అధిక ప్రయోజనాల వర్తింపు

3



## సీజేపీ నాయకుల విడుదలలో ప్రతిష్టంభన

- సీజేపీ నాయకుల విడుదలలో ప్రతిష్టంభన
- ప్రాణహాని వుందంటూ తప్పుకున్న మెజిస్ట్రేట్
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల కేసు కొత్త మేజిస్ట్రేట్ ముందుకు
- విచారణలో జాప్యంపై అభిజీత్ దీప్కే ఆగ్రహం
- ఢిల్లీ హైకోర్టుకు నేహా బోరా
- మెటాకు కేంద్రం సూచనలు



4

## మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు రిజిజు లేఖాస్త్రం

- అఖిలపక్ష భేటీపై కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్ర మంత్రి ప్రశ్నలు
- ఖర్గే, రాహుల్‌తో చర్చలకు ప్రయత్నించామని వెల్లడి
- పలు ప్రతిపక్ష పార్టీలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు ప్రకటన
- డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్ల అనుసంధానంపై కొనసాగుతున్న విభేదాలు



4

## కంటెంట్‌పై నిఘా పెట్టాలి
# మెటాకు కేంద్రం కీలక ఆదేశాలు..

- తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని మెయిటీ అడ్వైజరీ
- పాత వీడియోలు, ఎడిట్ చేసిన దృశ్యాలపై ప్రత్యేక దృష్టి
- కంటెంట్ ప్రామాణికత, తేదీ, ప్రదేశం వివరాలు జతచేయాలని సూచన




4

# అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక



**హైదరాబాద్, అక్టోబర్ 19 :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చెండుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయ దశమి అని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని అన్నారు. ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తుల పై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తు చేస్తుందన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మి చెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటిచెబుతుందని అన్నారు.




# కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి

**కాళేశ్వరం, అక్టోబర్ 19:**

రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు చాలా బాధలో ఉన్నారు. నిజానికి రాష్ట్రంలో ఉన్న రెండు పెద్ద నదులు గోదా కృష్ణ నీళ్లను సరిగా వాడుకుంటే మనకు ఈ పరిస్థితే ఉండదని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. కన్నెపల్లి పంప్ హౌజ్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని సోమవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మనం తెలంగాణ కోసం పిడికిలి ఎత్తి ఉద్యమం చేసింది కూడా మా నీళ్లు మాకు కావాలనే.. కానీ తెలంగాణ వచ్చాక మన నీటిని సంపూర్ణంగా వాడుకున్నామా అంటే వాడుకోలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వాసలు సరైన టైమ్ కి రావటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా గడిచిపోయింది. బీఆర్ఎస్ టైమ్ లో కృష్ణా నది ప్రాజెక్ట్ ల పై కొంత పనులు చేసి 4 నుంచి 5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారు. ఉత్తర తెలం గాణలో ఎస్సారెస్పీ, కడెం, అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు కు నీళ్లు ఇస్తూ 37 లక్షల ఎకరాలను స్థిరీకరణ చేసే ప్రయత్నం చేశారు.మొత్తంగా లక్షా 80 వేల కోట్లు ఖర్చు చేసి స్థిరీకరణ మాత్రమే చేశారు. కాళేశ్వరంలో కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. ఈ విషయం మనం చెబితే బీఆర్ఎస్ సోషల్ మీడియాలో మనపై దాడి చేస్తారు. కానీ నిజాలు మారవు. వాస్తవాలు కచ్చితంగా కఠినంగానే ఉంటాయి. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంకా ఘోరంగా పరిస్థితి తయారైంది.రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసి కొత్త ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. అడిగితే బకాయిలు చెల్లించామని చెబుతు న్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, దళిత బంధు లాంటి బకాయిలు చెల్లించకుండా ఇవే ఎందుకు చెల్లించినట్టు? కరెంట్, నీళ్లు ఇవ్వగలిగే పరిస్థితి ఉండి ఇవ్వకపోతే కాంగ్రెస్ నాయకులను ఊర్లలో తిరగకుండా చేస్తాం. మే మిచ్చిన సూచనలో ఏమైనా మార్పులు ఉంటే.. ఇం జనీర్లు వాటిని సరిచేసుకో మంటే చేసుకోవటానికి సిద్ధం.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనిచేస్తే సరే. లేదంటే మా ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా ఈ ప్రతిపాదనలను పూర్తి చేస్తాం. ఎక్కడ పొలాలను చూసినా సరే రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. అందుకే ప్రభుత్వానికి నీళ్లు ఎలా ఇవ్వొచ్చొ మార్గదర్శనం చేసేందుకు మేము ఇక్కడ వరకు వచ్చాం. ఈ ముఖ్యమంత్రి రైతులకు సంబంధించి సంఘాల్లో రాజకీయాలు చేయాలని చూస్తున్నాడు. రైతు సమస్యలకు సంబంధించిన సంఘాల్లో రాజకీయాలు వద్దని సూచిస్తున్నా, కాళేశ్వరం కోసం దాదాపు 93 వేల కోట్లు ఖర్చు పెట్టి కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. కాళేశ్వరం నీళ్లను ఇచ్చేందుకు కాలువలు తవ్వకపోవటంతో కొత్త గా 19 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వటం సాధ్యం కావటం లేదు. ఆ కాలువలను పూర్తి చేయాలంటే మరో 50 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఈ ప్రభుత్వం ఎలాగు అంత ఖర్చు చేసే పరిస్థితిలో లేదు. ఇప్పటికే ఎల్లంపల్లి సహా అన్ని రిజర్వాయర్ల లో నీళ్లు అడుగంటాయి. ఎల్లంపల్లిలో ఉన్న నీళ్లను తాగునీటి కోసం అని స్టోర్ చేశారు. రానున్న పది నెలలు మనం భయంకరమైన పరిస్థితులు చూడాల్సి ఉంటుంది. ఇప్పటికే 21 వేల చెరువులు ఎండిపోయి ముదిరాజ్, బెస్త సోదరులకు ఈ ఏడాది పనిలేని పరిస్థితి వచ్చింది. ఒక్కసారి కరువు వచ్చిందంటే చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. అందుకే ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తాము చేస్తున్న మంచి సూచనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# 14 నెలల ఆహార భద్రతకు ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి**

శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు భరోసా కల్పించేందుకు 14 నెలల వరకు అవస రాలను తీర్చేలా ఆహార ధాన్యాల నిల్వలను బలోపేతం చేయా లని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సోమవా రం సచివాలయంలోని తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాబోయే వ్యవసాయ సీజన్లలో వర్షపాతం. తగ్గినా రేషన్ సరఫరాలకు అంతరాయం కలగకుండా ధాన్యం సేకరణ, బియ్యం నిల్వల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రానున్న వరి పంట దిగుబడిపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం తదితర అవసరాలకు కలిపి నెలకు సుమారు 2.38 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని మంత్రి తెలిపారు. ఈ లెక్కన వార్షిక అవసరం 28.56 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. 2026 అక్టోబర్ 16 నాటికి రాష్ట్రంలోని బఫర్ గోదాముల్లో 9.64 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. ధరల పెరుగుదల వల్ల పేద కుటుంబాలపై పడే భారాన్ని తగ్గించేందుకు రేషన్ వ్యవస్థ ద్వారా గోధుమ పిండితోపాటు ఎంపిక చేసిన నిత్యావసర వస్తువులను అందించే అవకాశాన్ని మంత్రి పరిశీలించారు..

# అంతర్జాతీయ స్థాయిలో 'సమ్మిట్' ఏర్పాట్లుండాలి

**మొదటిపేజీ తరువాయి**

ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబరు ఆఖరులోగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుండి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. 'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే థీమ్‌తో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సమ్మిట్ ఏర్పాట్లపై కసరత్తు చేయాలన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఆ స్థాయిలో సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు. సమ్మిట్ వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని సీఎం అన్నారు. అందుకే సమ్మిట్ ఏర్పాట్లపై ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు ఒక కమిటీని నియమించుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం**

భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించే ముందు ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భవనంలోని కమిషనర్ కార్యాలయాన్ని ప్రారంభించి తరుణ్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించిన ఆయన ఎఫ్‌సీడీఏ కార్యాలయ ఆవరణలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ క్యాంపస్ (ఎనఐయ□ఎం) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంపస్ నమూనాను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.



# ఫార్మా ల్యాబ్‌ల ముసుగులో డ్రగ్స్ తయారీ.. హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

- **నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు విస్తరించిన మాదకద్రవ్యాల నెట్‌వర్క్**
- **కొండమడుగు, మౌలాలీ ల్యాబ్‌లలో మెఫెడ్రోన్, ఆల్ప్రాజోలం, ఎఫిడ్రిన్ తయారీ**
- **25 కిలోల మెఫెడ్రోన్ పట్టివేతతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం**
- **రసాయనాల సరఫరాదారులు సహా పలువురిపై దర్యాప్తు**
- **బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల ప్రమేయంపై అధికారుల అనుమానం**



**హైదరాబాద్, అక్టోబర్ 19:**

ఫార్మా పరిశ్రమల ముసుగులో సాగుతున్న భారీ మాదకద్రవ్యాల తయారీ, సరఫరా వ్యవహారాన్ని ఈగల్ ఫోర్స్ వెలుగులోకి తెచ్చింది. ఆల్ప్రాజోలం, ఎఫిడ్రిన్, మెఫెడ్రోన్ వంటి మత్తు పదార్థాలను తయారు చేస్తూ నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ శివారు ప్రాంతాల వరకు విస్తరించిన ముఠా కార్యకలాపాలను దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ నెట్‌వర్క్‌లో పలువురి పాత్రపై విచారణ కొనసాగుతోంది. తయారీ కేంద్రాల్లో పనిచేసిన కొందరు కార్మికులు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి వచ్చినవారై ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

**నాగ్‌పూర్ నుంచి కొండమడుగుకు..**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు చేయడంతో ముఠా ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న చేతన్ మేశ్రామ్ హైదరాబాద్‌కు మకాం మార్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అస్సాంకు చెందిన ఆయూబ్ సాయంతో నగరానికి చేరుకున్న అతడు.. కొండమడుగులోని వేటుకూరి లాబ్స్ యజమాని రామరాజు నుంచి రియాక్టర్‌ను లీజుకు తీసుకున్నాడు. గతంలో ఆ ల్యాబ్‌లో పనిచేసిన కాసాని శ్రీనివాస్, ఆయూబ్‌తో కలిసి డ్రగ్స్ తయారీకి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. మెఫెడ్రోన్ తయారీకి అవసరమైన ప్రొపియోనైల్ క్లోరైడ్ రసాయనాన్ని గుజరాత్‌లోని వల్సాద్ నుంచి సమకూర్చుకున్నట్లు సమాచారం. పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు ఆ రసాయనాన్ని హైడ్రోక్లోరిక్ యాసిడ్ పేరుతో లేబుళ్లు వేసి నాగ్‌పూర్ మీదుగా కొండమడుగుకు తరలించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అక్కడ పలుమార్లు రహస్యంగా రసాయనాలను తీసుకొచ్చి మెఫెడ్రోన్ తయారు చేసినట్లు వెల్లడైంది. 2026 ఆగస్టులో తయారు చేసిన 25 కిలోల మెఫెడ్రోన్‌ను బీబీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో ఈ వ్యవహారం బయటపడింది.

**మౌలాలీలో మరో తయారీ కేంద్రం**

కొండమడుగు ఘటన తర్వాత కూడా ముఠా కార్యకలాపాలు కొనసాగించినట్లు దర్యాప్తులో తేలింది. మౌలాలీలోని ఎస్ఎం లాబ్స్ యజమాని మాణిక్ రెడ్డి నుంచి మరో రియాక్టర్‌ను లీజుకు తీసుకుని అక్కడ ఆల్ప్రాజోలం, ఎఫిడ్రిన్ తయారు చేసినట్లు అధికారులు గుర్తించారు. ల్యాబ్ కెమిస్ట్ చాగంటి వెంకట లక్ష్మీకుమార్ సహకారం తీసుకున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఎస్ఎం లాబ్స్‌పై దాడి చేసి కాసాని శ్రీనివాస్, మల్లారెడ్డి, రమేశ్‌గౌడ్, లక్ష్మీకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. ముఠాకు రసాయనాలు సరఫరా చేస్తున్నారనే అనుమానంతో ముంబైలోని వాసాయికి చెందిన జేఎస్‌వీ గ్లోబల్స్ యజమాని జైరాజ్ కృష్ణ శెట్టిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుని విచారిస్తోంది.

**అంతర్జాతీయ సంబంధాలపై ఆరా**

అస్సాంకు చెందిన ఆయూబ్, ముజ్జమిల్ అనే కెమిస్ట్‌తో కలిసి చేతన్ ఈ వ్యవహారాన్ని నడిపినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. తయారీ కేంద్రాల్లో పనిచేసేందుకు ఆయూబ్ అస్సాం నుంచి కార్మికులను తీసుకొచ్చినట్లు సమాచారం. వారిలో కొందరు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించినవారై ఉండవచ్చన్న కోణంలో విచారణ జరుగుతోంది. రసాయనాల సేకరణ, డ్రగ్స్ తయారీ, రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా? ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లోని ముఠాలతో సంబంధాలున్నాయా? అనే అంశాలపై దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి.

# మహేష్, పొంగులేటి, వంశీకృష్ణలకు లీగల్ నోటీసులు

- **మహేష్, పొంగులేటి, వంశీకృష్ణలకు లీగల్ నోటీసులు**

**హైదరాబాద్, అక్టోబర్ 19 :**

బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు జారీ చేసింది. పార్టీ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపారు. ఇదే అంశంపై ఇప్పటికే ఓ దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు జారీ చేయగా అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్న ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు పంపారు. సోషల్ మీడియా ఖాతాల్లో చేసిన సంబంధిత పోస్టులను తక్షణమే బేషరతుగా తొలగించి తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని లీగల్ సెల్ డిమాండ్ చేసింది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని, నోటీసులకు స్పందించని పక్షంలో పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.




# పారదర్శక రెవెన్యూ సేవలు

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారు. గత ప్రభుత్వంలోని పెద్దల నిర్లక్ష్యం, నిర్వాకం, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల పదేళ్లలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్థవ్యస్తమైందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు సలహాల మేరకు రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి చట్టం అమలు, రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీసర్వే, భూ సమస్యల పరిష్కారం, ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయాల అమలు తీరును సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో మరింత బాగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు కోరిన భూవివాదాలు లేని తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏప్రిల్ 14, 2025 నుంచి ఇప్పటి వరకు 5,68,858 పాస్ బుక్కులు జారీ చేశామని అలాగే ఈ చట్టానికి ముందు 6,71,508 మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాస్ బుక్ లను రైతులకు అందజేశామన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీసర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నా రికార్డుల్లో హక్కులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై ఇబ్బందులు పడుతున్న రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలిచి సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం, నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీసర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకుపైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాలలో 15 గ్రామాలల్లో రీసర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450ఎకరాలకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పట్టాదారు పాస్‌బుక్‌లతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం లభించిందన్నారు. అలాగే ములుగు జిల్లా ముల్కపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వరావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగుఆ కొనసాగుతున్న సమస్యకు పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామన్నారు. ఇదే పద్ధతిలో ఇతర ప్రాంతాల్లో కూడా సర్వే నిర్వహించి దశాబ్దాలుగా భూమిపై హక్కుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు హక్కులు కల్పించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో రెవెన్యూ శాఖలో ప్రభుత్వం తీసుకుంటున్న విధాన పరమైన నిర్ణయాలు, ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు జరిగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అన్నారు. జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపై ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై కేబినెట్ సబ్‌కమిటీ.. భట్టికి కీలక బాధ్యతలు

**హైదరాబాద్, అక్టోబర్ 19:**
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తే పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా ఈ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిని సభ్యులుగా నియమించింది. ముఖ్యమంత్రి సలహాదారు, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ కమిటీకి అవసరమైన సమాచారాన్ని అందించనున్నారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు.

**కొరతల నివారణపై ప్రత్యేక దృష్టి**
ఎల్‌నినో పరిస్థితులపై ఇటీవల మంత్రులతో నిర్వహించిన సమావేశంలో సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాటైన ఉపసంఘం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖలకు సూచనలు, ఆదేశాలు ఇవ్వనుంది. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం లభ్యత, రిజర్వాయర్ల నిర్వహణ, ఆర్థిక వనరుల వినియోగంపై సమీక్షించనుంది. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యలతో పాటు ప్రజలు అనుసరించాల్సిన జాగ్రత్తలు, కేంద్ర ప్రభుత్వ సహకారం పొందే అంశాలపైనా చర్చించనుంది.

**11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టంపై ఆందోళన**
వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన చేపట్టింది. సుమారు 11.18 లక్షల ఎకరాల్లో పంటలు చేతికందే పరిస్థితి లేదని ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. వివిధ శాఖల నుంచి పరిస్థితులపై నివేదికలు సేకరిస్తూ, రైతులకు నష్టం తగ్గించే ప్రత్యామ్నాయ చర్యలను గుర్తించే ప్రయత్నం చేస్తోంది.

**కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల సాయం కోరిన ప్రభుత్వం**
రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 17 శాతం లోటు నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు. సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కరవు మండలాల ప్రకటనతో పాటు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరుతూ శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. ఈ నేపథ్యంలో భట్టి విక్రమార్క నేతృత్వంలోని సబ్‌కమిటీ తదుపరి రోజుల్లో పరిస్థితులను సమీక్షిస్తూ ప్రభుత్వ చర్యలకు మార్గనిర్దేశం చేయనుంది.

# సబ్ ప్లాన్ నిధుల వ్యయంలో వేగం పెంచాలి

**హైదరాబాద్, అక్టోబర్ 19 :**
ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడానికి వేగం పెంచాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయాన్ని వేగవంతం చేయడంతోపాటు నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ ప్రోగ్రెస్ సబ్‌ప్లాన్ అమలు, శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. కేటాయించిన నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చయ్యేలా సంబంధిత శాఖలు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కేటాయించిన నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన సబ్ ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమర్థవంతంగా ఉపయోగపడేలా శాఖలవారీగా వ్యయ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. చట్ట నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా సాధారణ పద్దుల తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పద్దుల కింద కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలతో ఆర్థిక శాఖ అధికారులు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించి ఖర్చుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ మేరకు ముందుగా ఖర్చులో ఎక్కువ అంతరం ఉన్న మొదటి ఐదు శాఖలు వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ, తరువాత క్రమంలో ఇతర శాఖల కార్యదర్శులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కేటాయించిన నిధులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి నివేదిక రూపొందించాలని సూచించారు.

**ఆర్థిక సంస్కరణలతో ఆదాయ వనరుల పెంపు**
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ వ్యయ నియంత్రణ, నిధుల సద్వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్థిక శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణకు చేపడుతున్న చర్యలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**నిపుణుల సలహాలతో మెరుగైన ఆర్థిక నిర్వహణ**



ఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, ఆర్థిక రంగ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. వారి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఫైనాన్స్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, ఇతర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ ప్రణాళికలు అవశ్యం

- **జిల్లా, మండలస్థాయిలోనూ రూపొందించాలి**
- **ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ఐఏఎస్‌లతో సీఎస్ సమీక్ష**

**హైదరాబాద్, అక్టోబర్ 19:**
ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా జిల్లా, మండల స్థాయిలోనూ ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడనున్న తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవడానికి రాష్ట్రస్థాయిలో వివిధ శాఖల వారీగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఇదేవిధంగా సూక్ష్మ స్థాయిలోనూ తగు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ వ్యవసాయానికి, గృహోపయోగ అవసరాలకు అందిస్తున్నామని, పరిశ్రమలకు ఏవిధమైన పవర్ కట్ విధించడం లేదని చెప్పారు. విద్యుత్ సరఫరాపై పరిశ్రమల యాజమాన్యాలు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. పగటిపూట అత్యవసర పరిస్థితుల్లో మాత్రం 25 డిగ్రీల పరిమితిలో ఏసీలను వాడాలని, సాయంత్రం ఆరు గంటల తర్వాత వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. అన్ని థర్మల్ స్టేషన్లలో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, యాదాద్రి థర్మల్ కేంద్రంలో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి ఈ కేంద్రానికి ప్రత్యేకంగా కేటాయించిన ఐదుగురు స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని తెలియచేసేందుకు త్వరలో అఖిలపక్ష సమావేశం జరుగుతుందని, అదేవిధంగా కేబినెట్ సబ్ కమిటీ సమావేశం కూడా ఉంటుందని సీఎస్ తెలిపారు. వ్యవసాయ అవసరాలకు స్థానికంగా ఉండే నీటి వనరులనుండి అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని తోడుతున్నారని, దీని వల్ల అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. మంజీరా, సింగూరు ద్వారా నీటి సరఫరా లేనందున ఈ జలాశయాలనుండి వచ్చే 110 ఎంజీడీల నీటిని, ప్రత్యామ్నాయ మార్గాలైన మిషన్ భగీరథ నుండి 60 ఎంజీడీలను, కృష్ణా, ఇతర మార్గాల ద్వారా నీటిని తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో తాగునీటి అవసరాలకు మాత్రమే నిబంధనలను అనుసరించి బోరు బావుల తవ్వకానికి అనుమతించాలని, నిర్మాణ, ఇతర పనులకు మాత్రం కొత్తగా బోరు బావుల తవ్వకానికి అనుమతించవద్దని, తాగునీటి అవసరాలకు ప్రస్తుతం ఉన్న బోరు బావులను మరింత లోతుగా తవ్వడానికి అనుమతిస్తున్నామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. నగరంలో నల్లాలకు అక్రమంగా మోటార్లను బిగించి పెద్ద ఎత్తున నీటిని తోడే విధానంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, హైడ్రా తదితర ఏజెన్సీలతో కలసి అక్రమ నీటి మోటార్లను ఏరివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ 1 నుండి హైదరాబాద్ నగరంలో నిర్మాణ పనులకు ఎస్టీపీల ద్వారా వచ్చే ట్రీట్మెంట్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్ల ద్వారా అందచేయనున్నట్టు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జల మట్టం గణనీయంగా పడిపోతున్నందున తాగునీటికి ఏవిధమైన సమస్య లేకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. నల్గొండ జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత ముమ్మరంగా చేస్తున్నామని ప్రత్యేక కార్యదర్శి హరిచందన తెలిపారు. కరీంనగర్ జిల్లాలో వచ్చే జూన్ వరకు తాగునీటి సమస్య లేదని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.డి.ఎక్కా చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని కార్యదర్శి ఇలంబర్తి చెప్పారు. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు జూన్ వరకు తాగు నీరు అందించాలంటే పాలేరు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల జలాలు కావాలని, ప్రస్తుతం ఇందులో రెండు టీఎంసీలే ఉన్నాయని ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండి జితేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారులకు దసరా కానుక

**హైదరాబాద్, అక్టోబర్ 19 :**
సింగరేణి అధికారుల చిరకాల విజ్ఞప్తిపై ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నెరవేరింది. కోలిండియా తరహా వేతనాలను అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఎగ్జిక్యూటివ్ కేడర్ 1 నుంచి ఎగ్జిక్యూటివ్ కేడర్ 7 వరకు ఉన్న సుమారు 1,800 మంది అధికారులకు ప్రయోజనం చేకూరనుంది. సవరించిన బేసిక్ వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయి. అయితే, ఆర్థిక ప్రయోజనాలు మాత్రం సింగరేణి బోర్డు ఆమోదం తెలిపిన ఈ ఏడాది సెప్టెంబర్ 25 నుంచి వర్తిస్తాయి. ఈ పెరిగిన వేతనాలను అక్టోబరు జీతాల నుంచి చెల్లించనున్నారు. సవరించిన వేతనాల అమలుకు సంబంధించి సంస్థ డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.




కోలిండియాలో వేతన అసమానతల నేపథ్యంలో మహారత్న సంస్థల వేతన విధానాన్ని తమకు అమలు చేయాలని కోలిండియా అధికారులు కోరారు. ఆ ప్రతిపాదనకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోలిండియా యాజమాన్యం ఆమోదం తెలిపాయి. అదే విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేయాలని సంస్థ అధికారులు ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన భట్టి విక్రమార్క దసరా లోపు అధికారులకు శుభవార్త అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ఏడాది జులైలో సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం ఈ అంశంపై సింగరేణి యాజమాన్యం కమిటీని ఏర్పాటు చేసి దాని నివేదిక ఆధారంగా బోర్డు ఆమోదంతో వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నది. తమ విజ్ఞప్తిపై ఇచ్చిన హామీని నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారుల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఇంధన అవసరాల కోసం మరింత అంకితభావంతో బొగ్గు ఉత్పత్తి చేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతామని స్పష్టం చేశారు.

**కొత్త వేతనాల ప్రకారం అధికారుల బేసిక్ వేతనాలు**

| కేడర్ | పాత బేసిక్ | కొత్త బేసిక్ వేతనం |
|---|---|---|
| ఇ1 | రూ.40,000 | రూ.60,000 |
| ఇ2 | రూ.50,000 | రూ.70,000 |
| ఇ3 | రూ.60,000 | రూ.80,000 |
| ఇ4 | రూ.70,000 | రూ.90,000 |
| ఇ5 | రూ.80,000 | రూ.1,00,000 |
| ఇ6 | రూ.90,000 | రూ.1,20,000 |
| ఇ7 | రూ.1,00,000 | రూ.1,20,000 |

**ఇటీవలే కార్మికులకు రూ.596 కోట్ల బోనస్**
ఇటీవలే దసరా సందర్భంగా సింగరేణిలోని దాదాపు 39 వేల మంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం తీపి కబురుగా రూ.596 కోట్ల బోనస్ అందించిన విషయం తెలిసిందే. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వారికి రూ.5,500 చొప్పున బోనస్‌ను ప్రకటించారు. తాజాగా అధికారులకు వేతన సవరణపై ఉత్తర్వులు వెలువడటం విశేషం.

# తెలంగాణలో దసరా పండుగకు విశిష్టమైన స్థానం : కేసీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 19:**
రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో, సంప్రదాయ వేడుకల్లో దసరా పండుగకి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. విజయానికి సంకేతంగా నిలిచిన జమ్మి వృక్షానికి పూజ చేయడం, శుభానికి సూచికగా పాలపిట్టను దర్శించుకోవడం, అలయ్ బలయ్ తో పరస్పరం ప్రేమాభిమానాలను చాటుకోవడం, పవిత్ర మైన జమ్మి ఆకును బంగారంగా భావించి పంచుకోవడం, పెద్దల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకునే మహోన్నత సంస్కృతి సంప్రదాయాన్ని దసరా పండుగ మనకందిస్తున్నదన్నారు. తెలంగాణ ప్రజా జీవితాల్లో దసరా పండుగకున్న ప్రత్యేకతను విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మానిదే చివరి విజయమనే విజయ దశమి స్ఫూర్తి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లోనూ, అనంతర పదేండ్ల ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులోనూ దసరా స్ఫూర్తితో ప్రజలు కొనసాగుతున్న అధర్మం మీద విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలను అన్ని రంగాల్లో విజేతలుగా నిలబెట్టడం ద్వారానే దసరా పండుగ స్ఫూర్తిని అమలు పరిచిన వారమౌతామని కేసీఆర్ స్పష్టం చేశారు. కొనసాగుతున్న కష్టాలను తొలగించి, తెలంగాణ ప్రజా జీవితాల్లో దసరా పండుగ, శుభాలను, సుఖసంతోషాలను తీసుకురావాలని కేసీఆర్ ప్రార్థించారు.

# హిందూ బంధువులకు విజయ దశమి శుభాకాంక్షలు

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 19 :**
చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి ప్రతీక విజయ దశమి అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. విజయ దశమి సందర్భంగా హిందూ బంధువులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామచంద్రుడు రావణాసురుడిపై సాధించిన విజయం, దుర్గామాత మహిషాసురుడిని సంహరించిన ఘట్టం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తాయని, అధర్మం ఎంత విర్రవీగినా కష్టపడి పనిచేస్తే చివరకు గెలిచేది ధర్మమే అని దసరా పండుగ మనకు ధైర్యాన్నిస్తుందని వివరించారు. దుర్గా దేవి నవరాత్రులు, బతుకమ్మ పండగ ద్వారా మహిళలను, ప్రకృతిని గౌరవించుకునే గొప్ప ఆధ్యాత్మిక వారసత్వం మన సనాతన ధర్మానికే సొంతం అని ఆయన అన్నారు. ఈ శుభ సందర్భంలో రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కాలని, కార్మికులు, యువత, మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, అందరి సహకారంతో, శుభాకాంక్షలతో దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా పరుగులు పెట్టాలని ఆకాంక్షించారు.



ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని, కష్టాలను అధిగమించే ధైర్యాన్ని, కొత్త లక్ష్యాలను సాధించే ఆత్మవిశ్వాసాన్ని ఆ జగన్మాత మనందరికీ ప్రసాదించాలని కోరుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరింత శక్తినిచ్చి వికసిత భారత నిర్మాణం కోసం ఆయన చేస్తున్న కృషికి అమ్మవారు సంపూర్ణ ఆశీర్వాదాన్ని అందించాలని ప్రార్థించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తూ, వికసిత భారత నిర్మాణంలో మన వంతు పాత్ర పోషిద్దామని ప్రజలకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.



# విజయవంతంగా ముగిసిన సారస్ మేలా

- **ఆరు లక్షల మంది సందర్శకులు**
- **రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు**

**హైదరాబాద్, అక్టోబర్ 19:**
గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్న సారస్ మేలా ఈ ఏడాది ఘన విజయాన్ని సాధించింది. ఈనెల 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన మేలాలో రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. మొత్తం 5,98,029 మంది సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేశారు. హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో 225 స్టాళ్లతో నిర్వహించిన ఈ మేలా మహిళా వ్యాపారులకు మంచి మార్కెట్ వేదికగా నిలిచింది. చివరి నాలుగు రోజుల్లో ప్రతిరోజూ రూ.కోటికి పైగా అమ్మకాలు జరగడం విశేషం.

**మూడేళ్లలో అత్యధిక అమ్మకాలు**
మేలాలో గత మూడేళ్ల అమ్మకాల గణాంకాలు ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాల ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణను చాటుతున్నాయి. 2024లో రూ.7.81 కోట్ల అమ్మకాలు జరగగా 2025లో రూ.3.28 కోట్ల వ్యాపారం నమోదైంది. ఈ ఏడాది ఏకంగా రూ.9.29 కోట్ల అమ్మకాలు జరిగాయి. 2025తో పోలిస్తే ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగాయి. సందర్శకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2025లో 1,69,015 మంది మేలాను సందర్శించగా ఈసారి 5,98,029మంది సందర్శించారు. మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, చేనేత వస్త్రాలు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. అమ్మకాలు ఆశించిన స్థాయిని మించడంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**మహిళా సాధికారతకు సారస్ మేలా బాటలు**
గ్రామీణ మహిళల సంప్రదాయ నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో ఈ మేలా కీలక పాత్ర పోషిస్తోంది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా మహిళలను కేవలం ఉత్పత్తిదారులుగానే కాకుండా సొంత వ్యాపారాలను నిర్వహించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి వేదికలు దోహదపడుతున్నాయి.

**మహిళలకు మెరుగైన సౌకర్యాలు**
మేలాలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామీణాభివృద్ధి శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. వారి వసతి, భోజనం, రవాణా ఖర్చులను శాఖే భరించింది. సందర్శకుల సౌకర్యార్థం సెంట్రలైజ్డ్ ఏసీ ఏర్పాటు చేయడంతోపాటు, పార్కింగ్, భద్రత, ఇతర మౌలిక వసతులను కల్పించారు. మెరుగైన నిర్వహణ, సౌకర్యవంతమైన వాతావరణం కారణంగా సందర్శకుల రాక పెరిగి అమ్మకాలు కూడా గణనీయంగా వృద్ధి చెందాయి.

**రికార్డు అమ్మకాలపై మంత్రి సీతక్క హర్షం**
మేలా విజయవంతం కావడం, మహిళా సంఘాల ఉత్పత్తులకు పెద్దఎత్తున ఆదరణ లభించడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించి వారి కష్టానికి తగిన ఆదాయం సమకూరడం సంతోషకరమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ స్వావలంబన సాధించాలన్నదే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. సారస్ మేలాను విజయవంతం చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సెర్ప్ సిబ్బందిని మంత్రి అభినందించారు.





# నిందితులను వదిలిపెట్టం"..

- **టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటనపై సీఎం ఫడ్నవీస్ ఫైర్..**

**ముంబై, అక్టోబర్ 20:**

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. ముంబై పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారని, ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించి కొందరిని గుర్తించారని వెల్లడించారు. ఫుట్‌బాల్ ఆట ముగించుకుని వస్తున్న సమయంలో ఆదివారం సాయంత్రం ముంబైలో టైగర్ ష్రాఫ్, ఆయన డ్రైవర్‌పై ఇద్దరు దుండగులు కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో టైగర్‌కు గాయాలయ్యాయి. దాడి వెనుక ఉన్న సూత్రధారులను కూడా వదిలిపెట్టబోమని ఫడ్నవీస్ హెచ్చరించారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న నిందితులను పట్టుకునేందుకు సంబంధిత పోలీసులతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# ఆసుపత్రి నుంచి ఎల్‌కే అద్వానీ డిశ్చార్జ్

- **ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో అక్టోబర్ 16న ఆసుపత్రిలో చేరిక**
- **ఆరోగ్యం మెరుగుపడటంతో ఇంటికి పంపిన వైద్యులు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:**

బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ (98) ఆరోగ్యం మెరుగుపడటంతో సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా అక్టోబర్ 16న న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేరిన ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో వైద్య సేవలు కొనసాగాయి. ఆరోగ్యం మెరుగుపడటంతో ఇంటికి పంపించినట్లు ఆసుపత్రి ప్రకటించింది. భారత రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన అద్వానీ.. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో 1999 నుంచి 2004 వరకు కేంద్ర హోం మంత్రిగా, 2002 నుంచి 2004 వరకు ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1927 నవంబర్ 8న కరాచీలో జన్మించిన ఆయన, 1942లో ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. అనంతరం బీజేపీ అగ్రనేతగా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు.



# హైదరాబాద్‌లో హనీ ట్రాప్ కలకలం.. నకిలీ ఖాతాలతో వల

- **యువతుల పేర్లతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి మోసాలు**
- **ప్రైవేట్ ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్**
- **రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు గుర్తింపు**
- **వెయ్యి మందికిపైగా నిందితుడితో చాటింగ్**
- **82 మందికి సంబంధించిన వ్యక్తిగత సమాచారం స్వాధీనం**

**హైదరాబాద్, అక్టోబర్ 20:**

సోషల్ మీడియాలో నకిలీ పరిచయాలతో సాగించిన హనీ ట్రాప్ వ్యవహారం హైదరాబాద్‌లో వెలుగుచూసింది. యువతుల పేర్లతో ఖాతాలు తెరిచి పలువురిని ఆకర్షించిన ఓ వ్యక్తి, వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సేకరించి బెదిరింపులకు దిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా బాధితుల నుంచి సుమారు రూ.25 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు. చార్మినార్ డీసీపీ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాబత్తుల పవన్ కుమార్‌ను ఈ కేసులో అరెస్టు చేశారు.

**నకిలీ ఖాతాలతో పరిచయాలు**

బీటెక్ చదువును మధ్యలోనే ఆపేసిన పవన్ కుమార్.. సోషల్ మీడియాలో యువతుల పేర్లతో నకిలీ ప్రొఫైల్స్ నిర్వహించేవాడు. వాటి ద్వారా యువకులతో చాటింగ్ చేస్తూ సన్నిహితంగా మెలిగేవాడు. ఈ క్రమంలో వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సేకరించి, వాటిని బయటపెడతానంటూ బెదిరించేవాడు. పరువు పోతుందనే భయంతో బాధితులు డబ్బులు చెల్లించేలా ఒత్తిడి తెచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

**విదేశాల వారికీ వల**

నిందితుడి నకిలీ ఖాతాల ద్వారా వెయ్యి మందికిపైగా వ్యక్తులు చాటింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 82 మందికి చెందిన ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు, ఇతర సున్నితమైన సమాచారం అతడి వద్ద ఉన్నట్లు తెలిపారు. బాధితుల్లో దేశంలోని ఇతర రాష్ట్రాల వారితోపాటు పాకిస్థాన్, కెనడా, టర్కీకి చెందినవారూ ఉన్నట్లు వెల్లడించారు.

**అపరిచితులతో అప్రమత్తం**

సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని డీసీపీ కిరణ్ సూచించారు. ప్రైవేట్ ఫొటోలు, వీడియోలను అపరిచితులకు పంపవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# సీజేపీ నాయకుల విడుదలలో ప్రతిష్టంభన

- **సీజేపీ నాయకుల విడుదలలో ప్రతిష్టంభన**
- **ప్రాణహాని వుందంటూ తప్పుకున్న మెజిస్ట్రేట్**
- **సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల కేసు కొత్త మేజిస్ట్రేట్ ముందుకు**
- **విచారణలో జాప్యంపై అభిజీత్ దీప్కే ఆగ్రహం**
- **దిల్లీ హైకోర్టుకు నేహా బోరా**
- **మెటాకు కేంద్రం సూచనలు**
- **పోలీసుల చర్యలపై కొత్త వివాదం**



**దిల్లీ | అక్టోబర్ 19 :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో కొనసాగుతున్న నిరసనల్లో సోమవారం సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల విడుదల వ్యవహారం ప్రధాన అంశంగా మారింది. ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ ముగుస్తున్న నేపథ్యంలో ఇద్దరినీ కొత్త ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచేందుకు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటలకు విచారణ జరగాల్సి ఉండగా, మధ్యాహ్నం 2.47 గంటల వరకు విడుదలపై నిర్ణయం వెలువడినట్లు ధ్రువీకరణ లభించలేదు.

**బెదిరింపుల కారణంగా విచారణ నుంచి తప్పుకున్న మేజిస్ట్రేట్**

సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల విడుదలకు సంబంధించిన విచారణను నిర్వహించాల్సిన ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ కేసు విచారణ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. మేజిస్ట్రేట్‌కు బెదిరింపులు వొచ్చాయన్న ఫిర్యాదుపై గుర్తుతెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే బెదిరింపులకు ఎవరు పాల్పడ్డారన్న విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. మరోవైపు సీజేపీ న్యాయవాదులు సమర్పించిన పూచీకత్తులను తిరస్కరించడం, విచారణలో ఆలస్యం జరగడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. న్యాయ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని సీజేపీ ఆరోపించింది. పోలీసులు ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ చట్టపరమైన విధానాన్నే అనుసరిస్తున్నామని తెలిపారు.

**సహచరులకు దీప్కే సందేశం**

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోమవారం తన సహచరుల విడుదలను కోరుతూ భావోద్వేగపూరిత సందేశం ఇచ్చారు. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, వారి నిర్బంధం ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న పోరాటాన్ని ఆపలేదని పేర్కొన్నారు. ఇద్దరి విడుదలలో జరుగుతున్న జాప్యానికి ప్రభుత్వ యంత్రాంగమే కారణమని దీప్కే ఆరోపిస్తున్నారు.

**పోలీసు నోటీసుపై హైకోర్టుకు నేహా బోరా**

విద్యార్థి నాయకురాలు నేహా బోరా తనకు దిల్లీ పోలీసులు జారీ చేసిన నోటీసును సవాలు చేస్తూ సోమవారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె న్యాయవాదులు కోరారు.అక్టోబర్ 16న దిల్లీలో నిర్వహించిన జాతీయ పతాక ప్రదర్శనకు సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు తాజా వార్తా కథనాలు పేర్కొన్నాయి. నిరసనల నేపథ్యంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు మరికొన్ని కేసులు నమోదు చేసినట్లు వెల్లడైంది.

**మెటాకు కేంద్రం సూచనలు.. సోషల్ మీడియా చర్చ**

దిల్లీలో నిరసనలు కొనసాగుతున్న సమయంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటాకు కీలక సూచనలు జారీ చేసింది. సోషల్ మీడియా అల్గారిథమ్‌ల ద్వారా ఒకే కథనానికి అధిక ప్రాధాన్యం కల్పించే విధంగా కంటెంట్‌ను సిఫార్సు చేయవొద్దని కేంద్రం సూచించింది.

**మరో ఐదు రోజుల కస్టడీ కోరిన దిల్లీ పోలీసులు**

సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను మరో ఐదు రోజులపాటు కస్టడీలో ఉంచాలని దిల్లీ పోలీసులు కోరినట్లు తెలుస్తుంది . ఇద్దరూ మరో నిరసనకు పిలుపునిచ్చే అవకాశం ఉందని పోలీసులు వాదించారు. అయితే తాము కొత్త కార్యక్రమానికి పిలుపునివ్వలేదని సీజేపీ నాయకులు పేర్కొన్నారు. నేహా బోరాకు సంబంధించిన కేసులో రూ.10 వేల శాంతిభద్రతల పూచీకత్తు, ఒక ష్యూరిటీ సమర్పించాలన్న నోటీసును ఆమె సవాలు చేశారు. దిల్లీ హైకోర్టుకు అక్టోబర్ 26 వరకు సెలవులు ఉన్నందున అత్యవసర విచారణ కోరుతున్నారు.నవంబర్ 1న ఇండియా కూటమి భారీ సభలోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎస్ఐఆర్ వ్యతిరేక ఉద్యమాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ సన్నాహాలు కొనసాగిస్తోంది. నవంబర్ 1న దిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు దిల్లీ పోలీసులు నిరభ్యంతర పత్రం జారీ చేశారు. 25 నుంచి నవంబర్ 3 వరకు సభ ఏర్పాట్లకు సంబంధించిన కాలపరిమితిని అనుమతిలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గతంలో ప్రకటించిన కార్యాచరణ ప్రకారం 10 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించాలి. వోటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడిన వ్యక్తులను గుర్తించి, తిరిగి నమోదు చేసుకునేందుకు సహాయం చేయడం కూడా ఈ కార్యక్రమంలో భాగం. నవంబర్ 1 సభకు ఇండి కూటమి పార్టీల నాయకులను ఆహ్వానించారు.

**నవంబర్ 1న ఇండి కూటమి భారీ సభ**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎస్ఐఆర్ వ్యతిరేక ఉద్యమాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ సన్నాహాలు కొనసాగిస్తోంది. నవంబర్ 1న దిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు దిల్లీ పోలీసులు నిరభ్యంతర పత్రం జారీ చేశారు. 25 నుంచి నవంబర్ 3 వరకు సభ ఏర్పాట్లకు సంబంధించిన కాలపరిమితిని అనుమతిలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గతంలో ప్రకటించిన కార్యాచరణ ప్రకారం 10 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించాలి. వోటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించిన వ్యక్తులను గుర్తించి తిరిగి నమోదు చేసుకునేందుకు సహాయం చేయడం కూడా ఈ కార్యక్రమంలో భాగం. నవంబర్ 1 సభకు ఇండి కూటమి నాయకులను ఆహ్వానించారు.

# కంటెంట్‌పై నిఘా పెట్టాలి మెటాకు కేంద్రం కీలక ఆదేశాలు..

- **తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని మెయిటీ అడ్వైజరీ**
- **పాత వీడియోలు, ఎడిట్ చేసిన దృశ్యాలపై ప్రత్యేక దృష్టి**
- **కంటెంట్ ప్రామాణికత, తేదీ, ప్రదేశం వివరాలు జతచేయాలని సూచన**
- **ప్రభుత్వ సూచనలపై డిజిటల్ హక్కుల సంస్థల అభ్యంతరం**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:**

సోషల్ మీడియాలో తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా తన ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్ సిఫార్సు చేసే అల్గారిథమ్‌ల పనితీరును సమీక్షించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మెయిటీ) సూచించింది. ఒకే తరహా కథనాలు వినియోగదారులకు పదేపదే కనిపించడం, తప్పుదారి పట్టించే సమాచారం విస్తృతంగా వ్యాపించడం వంటి పరిణామాలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

**పాత వీడియోలతో ఉద్రిక్తతలు వద్దు**

నిరసనలు, ప్రజా ఉద్యమాలు, శాంతి భద్రతలకు సంబంధించిన ఘటనల్లో పాత లేదా మార్పులు చేసిన ఫొటోలు, వీడియోలను ప్రస్తుత పరిణామాలుగా ప్రచారం చేసే అవకాశాలపై అప్రమత్తంగా ఉండాలని మెటాకు సూచించింది. ఇలాంటి దృశ్యాల ద్వారా విద్వేషాలు, హింస ప్రేరేపించే ప్రయత్నాలను గుర్తించేందుకు నిఘా పెంచాలని పేర్కొంది. ఆడియో, వీడియోల ప్రామాణికతతో పాటు అవి ఎప్పుడు, ఎక్కడ చిత్రీకరించారనే వివరాలను స్పష్టంగా తెలియజేసేలా సందర్భోచిత సమాచారాన్ని జతచేయాలని తెలిపింది. ఐటీ నిబంధనలు2021 ప్రకారం అనుమానాస్పద కంటెంట్‌ను వేగంగా గుర్తించి సంబంధిత ప్రభుత్వ సంస్థలకు నివేదించాలని సూచించింది.

**సెన్సార్‌షిప్ ఆందోళనలు**

కేంద్రం జారీ చేసిన అడ్వైజరీపై డిజిటల్ హక్కుల సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి సూచనలు పరోక్ష సెన్సార్‌షిప్‌కు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం ఈ సూచనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. అడ్వైజరీ అమలులో భాగంగా తొలగించిన లేదా ప్రాధాన్యత తగ్గించిన కంటెంట్ వివరాలను మెటా బహిరంగంగా వెల్లడించాలని కోరాయి. తప్పుడు సమాచార నియంత్రణకు తీసుకునే చర్యలు, భావప్రకటనా స్వేచ్ఛపై చూపే ప్రభావం మధ్య సమతుల్యత అవసరమనే చర్చ ఈ పరిణామంతో మరోసారి తెరపైకి వచ్చింది.

# మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు రిజిజు లేఖాస్త్రం

- **అఖిలపక్ష భేటీపై కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్ర మంత్రి ప్రశ్నలు**
- **ఖర్గే, రాహుల్‌తో చర్చలకు ప్రయత్నించామని వెల్లడి**
- **పలు ప్రతిపక్ష పార్టీలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు ప్రకటన**
- **డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్ల అనుసంధానంపై కొనసాగుతున్న విభేదాలు**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:**

మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై మరోసారి కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ అంశాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ప్రతిపక్షాలతో ఇప్పటికే పలుమార్లు సంప్రదింపులకు ప్రయత్నించామని, కీలక బిల్లుల విషయంలో రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను కోరారు. ఈ మేరకు ఖర్గేకు సోమవారం లేఖ రాశారు.

**ఖర్గే, రాహుల్‌తో చర్చలకు యత్నం**

మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ అంశాలపై చర్చించేందుకు ఈ ఏడాది మార్చి 16, 26, ఏప్రిల్ 12 తేదీల్లో ఖర్గేకు లేఖలు రాసినట్లు రిజిజు వెల్లడించారు. బిల్లులకు మద్దతు ఇవ్వాలని కోరడంతోపాటు ఖర్గేతో వ్యక్తిగతంగానూ చర్చించినట్లు తెలిపారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల సమయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ సమావేశమై సహకారం కోరినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ నుంచి చర్చలకు సంబంధించిన తేదీలు ఖరారు కాలేదని ఆరోపించారు. దీంతో ఇతర పార్టీల నాయకులతోనూ సంప్రదింపులు జరిపినట్లు వివరించారు.

**పలు పార్టీలతో సంప్రదింపులు**

డీలిమిటేషన్ ప్రతిపాదనలపై ఏకాభిప్రాయం సాధించేందుకు డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేన (యూబీటీ), ఎంఐఎం, బిజూ జనతాదళ్ ప్రతినిధులతో చర్చించినట్లు రిజిజు తెలిపారు. ఈ నేపథ్యంలో మరోసారి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే జరిగిన సంప్రదింపులను పరిగణనలోకి తీసుకుని, బిల్లులపై నిర్మాణాత్మక చర్చలకు ముందుకు రావాలని ఖర్గేకు సూచించారు. జాతీయ ప్రాధాన్యమున్న అంశాల్లో అన్ని పార్టీల భాగస్వామ్యానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**పార్లమెంట్ ప్రోరోగ్‌పై వివరణ**

వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడినప్పటికీ పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ప్రోరోగ్ చేయకపోవడంపై ఖర్గే తన లేఖలో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై రిజిజు వివరణ ఇచ్చారు. సభ నిరవధిక వాయిదా అనంతరం ప్రోరోగ్ చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట గడువు విధించలేదని పేర్కొన్నారు. గతంలోనూ పార్లమెంట్ సమావేశాలను ప్రోరోగ్ చేయడంలో ఎక్కువ వ్యవధి తీసుకున్న సందర్భాలున్నాయని గుర్తుచేశారు.

**డీలిమిటేషన్‌తోనే రిజర్వేషన్లా?**

లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుత 543 నుంచి 850 వరకు పెంచే ప్రతిపాదన కేంద్రం ముందుకు తెచ్చింది. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయవచ్చన్నది ఎన్డీఏ ప్రభుత్వ వాదన. ఈ క్రమంలో మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో అనుసంధానించడంపై వివాదం నెలకొంది. ప్రస్తుత 543 మంది సభ్యుల లోక్‌సభలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. రిజర్వేషన్లకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తోంది. ఈ భిన్న వైఖరుల నేపథ్యంలో రెండు అంశాలపై రాజకీయ ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. కీలక చట్టాల ఆమోదానికి ఆటంకాలు కల్పించకుండా కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని రిజిజు కోరారు.

# బాలానగర్ లో సద్దుల బతుకమ్మ వేడుకలు

- పూల శోభతో..
  కోలాట నృత్యాలతో అలరించిన మహిళలు



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :**

బాలానగర్ మండల పరిధిలోని రాజు కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఏఐఎంఐఎం నాయకుడు మహం కాళి శివ శంకర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. కాలనీ మహిళలు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఏఐఎంఐఎం కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ అన్వర్ సదత్, ఎరుపుల వెంకట్ ముఖ్య అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. స్థానిక మహిళలు తీరొక్క పూలతో అందంగా బతుక మ్మలను తీర్చిదిద్దారు. "ఒక్కేసి పువ్వేసి చందమామ.. చిత్తు చిత్తుల బొమ్మ" అంటూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడిపాడా రు. మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ ఎంతగానో ఆకట్టుకు న్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, ఆచార సంప్రదా యాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో రోజుకొక రూపంలో గౌరీదేవిని పూజిస్తామని, అందులోనూ చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకోవడం మన సంప్రదాయమని కొనియాడారు. బతుకమ్మ పండుగ మహి ళల ఐక్యతకు, ఆనందానికి ప్రతీక అని ఆయన అన్నారు. కార్యక్రమంలో అశోక్ ముదిరాజ్ (టైసన్), శివ ముదిరాజ్, బసంత్, సమర్థ్ గౌడ్, రాజు, ఇతరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ దుర్గామాత ఆలయంలో నవరాత్రి వేడుకలు

- ఆలయ దాతలకు ఘన సన్మానం
- మూలవిరాట్, పంచలోహ విగ్రహ దాతల సేవలకు ఉత్సవ కమిటీ అభినందన





**కొండాపూర్, రాజముద్ర న్యూస్ :**

కొండాపూర్ ఆనంద్ నగర్ కాలనీలోని శ్రీ దుర్గామాత దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి విశేష సేవలం దించిన దాతలను దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. దేవాలయ మూలవిరాట్ విగ్రహాన్ని సమర్పించిన దాత నరేంద్ర జీస్తా ని, పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని అందించిన దాత కుమారి అస్మానీ అలంకృత సాగర్ ని, అమ్మవారికి బంగారు కళ్ళు సమర్పించిన దాతలు రంగారావు – లక్ష్మి దంపతులను కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి, అమ్మవారి సేవకు తమ దాతృత్వాన్ని చాటు కున్న దాతల సేవలు చిరస్మరణీయమని, వారి సహకారం ఆలయ ఆధ్యాత్మిక వైభవానికి ఎంతో తోడ్పడుతుందని కమిటీ సభ్యులు కొనియాడారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు.

# ప్రజాసేవకుడు వజ్రేష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు

- దేవి ఫంక్షన్ హాల్ లో ఘనంగా జన్మదిన వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:**

ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ, గెలుపోటములకు అతీతంగా నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మేడ్చల్ శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేవి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్ పాల్గొని వజ్రేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవను బాధ్యతగా స్వీకరించి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజల మధ్య ఉంటూ వారి సంక్షేమం కోసం పనిచేయడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. వజ్రేష్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిం చాలని, ప్రజలకు మరింత సేవలందిస్తూ ఆయురారో గ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సామూహిక సత్యనారాయణ పూజ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :**

రామరెడ్డి మండల కేంద్రంలోని గాంధీ యువజన సమైక్య 19 వ వార్షికోత్సవం సందర్భంగా శరన్నవ రాత్రుల ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఘనంగా నిర్వహిస్తుంది నవరాత్రులలో 9వ రోజు మహిషాసుర మర్దిని అమ్మవారి గా విశేషంగా అలంకరించారు ఉదయం 9 గంటలకు వేద పండితులు జంగం దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో 10 మంది జంటల చే సామూ హిక సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గాంధీ యువజన సమైక్య అధ్యక్షుడు నామాల శ్రీకాంత్ సభ్యులు నోముల సాయికుమార్ ఏల్లుల నరేష్ , పిప్పరి లింబాద్రి మూడవ వార్డు మెంబర్ , నామల సత్యం, వీరితోపాటు కాశబోయిన చందు దినేష్ ,పందిరి శ్రీకాంత్, భరత్ గౌడ్ , సందీప్ గౌడ్, తదితరులు కార్యక్రమ★ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు ఇంకా స్థానిక గురుస్వాములు, కందువా స్వాములు, కంకణ స్వాములు, బాల స్వాములు,భజన మండలి సభ్యులు, గ్రామ మహిళలు యువకులు చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహిసాసుర మర్దిని మాత ను దర్శించుకున్నారు రోజంతా భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది ఉత్సవ కమిటీ భక్తులందరు మహిళలు భక్తి గీతాలు కోలాటం అమ్మ వారికి కీర్తించారు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విజయదశమి నాటి పత్రిక కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

## కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**కొండగట్టు రాజముద్ర న్యూస్ :**



జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజక వర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఈ.వి. వేణుగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆల య అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చ కులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజే శారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరిశీలకులు లక్ష్మారెడ్డి, ప్రధాన అర్చకులు చిరంజీవ స్వామి, ఉప ప్రధాన అర్చకులు రామచంద్ర ప్రసాద్, ఇతర అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి సర్వం సిద్ధం

**కరీంనగర్, రాజముద్ర న్యూస్ :**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న నగరంలో నిర్వహించనున్న నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో సోమవారం సంబంధిత అధికారు లతో కలిసి మానకొండూర్, కొత్తపల్లి నిమజ్జన పాయింట్లను ఆయన సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో వివాహిత అదృశ్యం

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**



చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో పుట్ట అలివేలమ్మ (20) అనే వివాహిత అదృశ్యమైంది. ఆమె భర్త పల్లె గోనెల బాలరాజ్ (26) సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందించిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. బాలరాజ్‌కు పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన అలివేలమ్మతో ఏడాది క్రితం వివాహమైంది. అనంతరం ఆమెను చేవెళ్లకు తీసుకువచ్చి అక్కడే నివాసం ఉంటున్నారు. అలివేలమ్మ స్థానికంగా ఓ బుక్‌స్టోర్‌లో పనిచేస్తోంది. ఈ నెల 19న ఉదయం బాలరాజ్ కూలి పనికి వెళ్లగా, అలివేలమ్మ ఇంటి నుంచి ఓ బ్యాగుతో వెళ్లిపోయినట్లు ఉదయం 11 గంటల సమయంలో ఆమె తల్లి వీరమ్మ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదని బాలరాజ్ తెలిపాడు. ఆమె స్నేహితులు ఉంటున్న గదిని ఖాళీ చేసి వెళ్లిపోయారని, వారితో పాటు అలివేలమ్మ కూడా వెళ్లినట్లు తెలిసిందని పేర్కొన్నాడు. బుక్‌స్టోర్ యజమానిని విచారించగా, గత రెండు రోజులుగా ఆమె పనికి రావడం లేదని, ఈ నెల 19న ఉదయం సుమారు 9 గంటలకు పాన్‌షాప్ వద్దకు వచ్చి జడ వేసుకుని వస్తానని చెప్పి వెళ్లినట్లు సమాచారం అందిందని తెలిపాడు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. అదృశ్యమైన అలివేలమ్మ ఎత్తు సుమారు 5 అడుగుల 3 అంగుళాలు, ఛాయ చామనఛాయ కాగా, అదృశ్యమైన సమయంలో డ్రెస్ ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

విజయదశమి పండుగను పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపాలిటీ 9వ వార్డులో పనిచేస్తున్న సిబ్బందికి దామరగిద్ద మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ మాల పెంటయ్య నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా సిబ్బందికి వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం సిబ్బందిలో ఆనందాన్ని నింపింది.

## ఎండిన వరి పంటలను పరిశీలించిన సర్పంచ్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండలం జగదంబ తండా పరిధిలో ఎండిన వరి పొలాలను గ్రామ సర్పంచ్ బుక్యా లత నందా నాయక్, ఉప సర్పంచ్ పూర్ణ రాజు పరిశీలించారు, రైతులు ఎండిన వరి పంటలు చూపిస్తూ తమ ఆవేదన వ్యక్తం చేస్తూ ఎన్నో డబ్బులు పెట్టుబడులు పెట్టి వరి పంటలు ఎండిపోవడం వలన చాలా ఆర్థికంగా నష్టపోయామని తమ బాధను వెలిబుచ్చారు. బోర్లలో వాటర్ లేక, కరెంటు కోతలతో చేతికి వచ్చిన పంటలు పంటలు ఎండిపోవడం చాలా ఆర్థిక భారంగా ఉన్నదని రైతులు తమ బాధను వెలిబుచ్చారు, పంటలు ఎండిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందజేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామ సర్పంచ్ నీ కోరారు, అందుకు గాను గ్రామ సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని రైతులతో చెప్పారు.

## కాలభైరవ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

కామారెడ్డి జిల్లా, రామారెడ్డి మండలం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామారెడ్డి మండలం, ఇసన్నపల్లి గ్రామంలోని శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపునకు ఖరారైంది. ఈ నెల 22వ తేదీ (గురువారం) ఉదయం 10:00 గంటలకు ఆలయ ప్రాంగణంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఆలయ ఈవో కార్యనిర్వహణాధికారి ప్రభు రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు.

## అక్కన్నపేటలో బంజారా భవన్ నిర్మాణానికి మంజూరు ఇవ్వాలి

**కరీంనగర్, రాజముద్ర న్యూస్ :**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో బంజారా భవన్ నిర్మాణానికి మంజూరు ఇవ్వాలని కోరుతూ అక్కన్నపేట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బాణోతు వెంకట్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, బంజారా నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో బంజారా భవన్ నిర్మాణ ఆవశ్యకతను మంత్రికి వివరించి, భవన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బంజారా సామాజిక వర్గ ప్రజల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సమావేశాలు నిర్వహించుకోవడానికి భవన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బంజారా ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని భవన్ నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బాణోతు వెంకట్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, బంజారా నాయకులు పాల్గొన్నారు.



# నవ్వుల రారాజు రాజబాబు

## నేడు రాజబాబు జయంతి

**పుణ్యమూర్తుల అప్పలరాజు అనగానే ఎవరా అని ఆలోచించ వచ్చు. రాజబాబు అంటే హాస్య నటునిగా తెలియని తెలుగు వారుండరు. రేలంగి, రమణారెడ్డి తరవాత అంతకు మించిన ప్రేక్షక ఆదరణ పొందిన నటునిగా గుర్తింపు పొందారు.**

తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత గొప్ప హాస్య నటుల్లో ఒకరు రాజబాబు. రెండు దశాబ్దాల తక్కువ వ్యవధిలో ఆయన శిఖర స్థాయిని అందుకున్నారు. దాదాపు 600 చిత్రాల్లో నటించిన రాజబాబు.. తెలుగు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తారు. అప్పట్లో ఆయన దక్షిణాదిన అత్యంత డిమాండ్ ఉన్న కమెడియన్లలో ఒకరు. రోజుకు రెండు మూడు షిఫ్టుల్లో విరామం లేకుండా పని చేసిన ఘనత ఆయనది. తెలుగు చలనచిత్ర రంగంలో రెండు దశాబ్దాలు హాస్య నటునిగా వెలిగిన రాజబాబు (అక్టోబరు 20, 1935 – ఫిబ్రవరి 14, 1983) "శతాబ్దపు హాస్య నటుడి"గా ప్రసంశలు అందుకొన్న గొప్ప వ్యక్తి. అక్టోబరు 20, 1935 తేదీన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం లో పుట్టిన రాజబాబు పూర్తి పేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. తల్లిదండ్రులు పుణ్యమూర్తుల ఉమా మహేశ్వర రావు, రవణమ్మ. నిడదవోలు లోని పాఠశాల చదువు చదువుతూనే బుర్రకథ నేర్చుకోవడానికి శ్రీ అచ్యుత రామయ్య గారి దగ్గర చేరారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ఉపాధ్యాయ శిక్షణ కోర్సు ముగించి తెలుగు ఉపాధ్యాయునిగా కొద్దికాలం పని చేశారు. ఉపాధ్యాయునిగా పని చేసేటప్పుడే నాటకాలలో పాలుపంచు కొనేవారు. రాజబాబు డిసెంబరు 5, 1965 తేదీన లక్ష్మీ అమ్మలు ను వివాహమాడారు. వారికి నాగేంద్రబాబు, మహేశ్ బాబు అనే ఇద్దరు సంతానం కలిగారు. ఒక సారి నాటకంలో రాజబాబును చూసిన గరికపాటి రాజారావు (పుట్టిల్లు సినిమా దర్శకుడు) సినిమాలలో చేరమని ఉత్సాహ పరిచారు. దాంతో చెప్పా చెయ్యకనే ఫిబ్రవరి 7, 1960 రోజున మద్రాసు చేరుకొన్నారు. పూట గడవడానికి హాస్య నటుడు అడ్డాల నారాయణ రావు పిల్లలకు ప్రైవేటు చెప్పేవారు. కొన్నాళ్ళ తరువాత అడ్డాల నారాయణ రావు రాజబాబుకి సమాజం సినిమాలో అవకాశం కల్పించారు. మొదటి సినిమా తరువాత"తండ్రులు–కొడుకులు","కులగోత్రాలు","స్వర్ణగౌరి","మంచి మనిషి" మొదలగు చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. స్వర్ణగౌరి చిత్రానికి గాను 350 రూపాయలు మొట్టమొదటి పారితోషికంగా స్వీకరించారు. మొదటి చిత్రం విడుదల తరువాత వచ్చిన చిన్న చిన్న పాత్రలలో నటిస్తూనే "కుక్కపిల్ల దొరికిందా", "నాలుగిళ్ళ చావిడి", "అల్లూరి సీతారామరాజు" మొదలగు నాటకాలు వేశారు. జగపతి ఫిలింస్... వి.బి.రాజేంద్రప్రసాద్ చిత్రం "అంతస్తులు" చిత్రంలో నటించి నందుకు గాను మొట్ట మొదటి సారిగా పెద్దమొత్తం 1300 రూపాయల్ని పారితోషికంగా పొందారు. ఇక వెనక్కు తిరిగి చూసుకో వలసిన అవసరం లేకుండా వరుసగా నిర్మాణ సంస్థలు నిర్మించిన ఎన్నో చిత్రాలలో నటించారు. ఆకాశ రామన్న, సతీ శబరి, ప్రచండ భైరవి, సత్య హరిశ్చంద్ర, సంగీత లక్ష్మి, పరమానందయ్య శిష్యుల కథ, ఉమ్మడి కుటుంబం, విచిత్ర కుటుంబం లాంటి చిత్రాలలో నటించారు. రాజబాబుకు జంటగా లీలా రాణి, మీనా కుమారి, ప్రసన్న రాణి, గీతాంజలి లాంటి వారు నటించినా, ప్రేక్షకాదరణ పొందిన జోడీ మాత్రం రమాప్రభ అని చెప్పక తప్పదు. ఇద్దరు అమ్మాయిలు, ప్రేమనగర్, ఇల్లు ఇల్లాలు, పల్లెటూరి బావ, సెక్రెటరి, జీవన జ్యోతి, కార్తీక దీపం, అడవి రాముడు, సోగ్గాడు లాంటి చిత్రాలు రాజబాబు – రమాప్రభ జోడీకి మంచి హాస్య జంటగా పేరు తెచ్చాయి. రాజబాబు తాతా మనవడు, పిచ్చోడి పెళ్ళి, తిరుపతి, ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు లాంటి సినిమా లలో హీరోగా నటించారు. ఈ సినిమాలలో ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు సినిమాలను స్వయంగా బాబ్ ఉ బాబ్ ప్రొడక్షన్స్ అన్న నిర్మాణ సంస్థ పేరుతో నిర్మించారు. సినిమాలో ప్రేక్షకులను తన అద్భుత నటనతో కడుపుబ్బ నవ్వించిన రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్విక ఆలోచనలు గలవారు. ప్రతి ఒక్క సంవత్సరం తన పుట్టిన రోజు సందర్భంగా పాతతరం నటుల్ని, నటీమణుల్ని సత్కరించే వారు. ప్రత్యేకంగా హాస్యంలో తనకు స్పూర్థిని ఇచ్చిన బాలకృష్ణను సత్కరించారు. రాజబాబుచే సత్కారం పొందిన వారిలో ఇంకా డా.శివరామ కృష్ణయ్య, సూర్యకాంతం, సావిత్రి, రేలంగి మొదలగు ప్రముఖులు ఉన్నారు. ఎన్నో సంస్థలకు ఎన్నెన్నో విరాళాలిచ్చిన దాత రాజబాబు. రాజమండ్రిలో చెత్తా చెదారం శుభ్రపరిచే వాళ్ళకు అదే ఊరిలో దానవాయి పేటలో భూమి ఇచ్చారు. అంతే కాక కోరుకొండలో జూనియర్ కాలేజీ కట్టించారు. దాని పేరు కూడా ఆయన పేరు మీదే "రాజబాబు జూనియర్ కళాశాల"గా ఉంది. వరుసగా ఏడు సార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన మొట్ట మొదటి హాస్య నటుడు రాజబాబు. ఆయన జీవితంలో మొత్తం తొమ్మిది ఫిలిమ్ ఫేర్ అవార్డులు, మూడు నంది బహుమతులు, ఎన్నెన్నో అవార్డులు రివార్డులూ పొందారు. "చెన్నై ఆంధ్రా క్లబ్బు" వారు వరుసగా ఐదు సంవత్సరాలు "రోలింగ్ షీల్డు"ని ప్రధానం చేసారు. అంతే కాక శతాబ్దపు హాస్య నటుడిగా అవార్డు పొందారు. రాజబాబుకు ఘంటసాల పాటలంటే ఎంతో ఇష్టం. మహా శివరాత్రి రోజు, ఘంటసాల వర్ధంతి అయిన ఫిబ్రవరి 11 రోజున మొత్తం ఘంటసాల పాటలు వింటూనే ఉన్నారు. అదే రోజు రాత్రి గొంతులో ఏదో ఇబ్బంది వచ్చి హైదరాబాదు లోని థెరెసా ఆసుపత్రిలో చేరాడు. ఆ ఆసుపత్రి లోనే ఫిబ్రవరి 14, 1983 రోజున తెలుగు సినీ అభిమానుల్ని శోక సముద్రంలో ముంచి స్వర్గస్తుడయ్యారు. అనుకరించడానికి అసాధ్యమైన ప్రత్యేకమైన శైలి రాజబాబుది. ఆయన మరణంతో తెలుగు చిత్రసీమకు కలిగిన లోటు ఎప్పటికి తీర్చలేనిది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# చెడుపై విజయమే విజయ దశమి

**నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు అంటారు.**




నవ రాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం. సాధారణంగా విజయ దశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది. పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృడపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు.

శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పౌష్టికాహారంతో ఎముకలకు పటుత్వం

## నేడు బోలు ఎముకల వ్యాధి దినం



ఆధునిక సమాజంలో ఎన్నో వ్యాధులు మానవుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయి. బలవర్ధక మైన ఆహారం తీసుకోక పోవడంతో శరీరంలో శక్తి క్షీణించడమే కాకుండా, ఎముకల పటుత్వం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తు తున్నాయి. ముఖ్యంగా అస్టియో పొరోసిస్ (బోలు ఎముకలు) వ్యాధి సంక్రమిస్తుంది. ఆహారపు అలవాట్లు, చెడు వ్యసనాల కారణంగా శరీరంలోని ఎముకలు పెళుసుగా మారి పలువురు ప్రమాదానికి లోనవు తున్నారు. ఎక్కువగా వృద్ధులకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువకుల్లోనూ కనిపిస్తున్నది. ప్రత్యేకించి మహిళల్లో ఈ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఒక్కోసారి ఈ వ్యాధి మరణానికి కూడా దారి తీస్తుంది. ఈ నేపథ్యంతో ఆస్టియో పొరోసిస్ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధిపై అవగాహన కలిగించేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతిఏటా అక్టోబరు 20వ తేదీన ప్రపంచ ఆస్టియో పొరోసిస్ నివారణ దినోత్సవాన్ని నిర్వహిం చాలని తీర్మానించింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక పనిముట్లు అందుబాటు లోకి రావటంతో శారీరక శ్రమ తగ్గింది. దీనికితోడు బలవర్ధకమైన ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. వ్యాధిపై అవగాహన లేక పోవడంతో వ్యాధిగ్రస్థుల సంఖ్య నానాటికీ పెరుగు తున్నది. ఈ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు లేకపోవడంతో కొందరు మంచానికే పరిమితం అవుతున్నారు. 80 శాతం మహిళలు, 20 శాతం పురుషుల్లో కనిపిస్తున్న ఈ బోలు వ్యాధి (ఆస్టియో పొరోసిస్) అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో 50–60 ఏళ్లల్లో కనిపించే బోలు వ్యాధి ఇప్పుడు 30 ఏళ్ల వారిలోనూ ఉండటం గమనార్హం. వృద్ధుల్లో ప్రధాన సమస్యగా ఉన్న ఈ వ్యాధిపై అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. చిన్నతనం నుంచి కాల్షియంతో కూడిన ఆహార పదార్ధాలు తరచుగా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి ఉపశ మనం పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా మహిళల్లో వస్తుంది. 45 ఏళ్లు పైబడిన మహిళలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతున్నారు. విటమిన్ డీ లోపం, కాల్షియం తక్కువగా తీసుకోవడం, రుతు స్రావం తొందరగా ఆగిపోవడం, జన్యు పరమైన కారణాలు, రోగ నిర్ధారణ నియమాలు లేకపోవడం, ఎముకల ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. థైరాయిడ్ కారణంగా కూడా దీని ప్రభావం ఎముకల సాంద్రతపై కూడా పడుతోంది. సూర్యరశ్మి తగలక పోవడం, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, విటమిన్ 'డి'కొరత, స్టెరాయిడ్స్ వాడటం తదితర కారణాలతో ఇది వస్తుంది. సూర్యకాంతిలో గడిపే సమయం తక్కువగా ఉండడంతో మహిళలు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి సూర్యరశ్మి తగలక పోవటం, ఏసీలోనే ఎక్కువ సేపు గడపటం వల్ల కూడా ఆస్టియో పొరోసిస్ వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గతంలో లాగా శారీరక శ్రమ తగ్గింది. ఇందువల్ల గ్రామీణ ప్రాంతాల వారు కూడా ఈ వ్యాధికి ఎక్కువగా గురవు తున్నారు. ఉదర సంబంధమైన వ్యాధులు ఉన్న వారిలో బోలు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. సరైన పోషకాహారం తీసుకోక పోవడం, హైపో థైరాయి డిజం, హైపర్ థైరాయిడిజం, చిన్న వయసులోనే గర్భసంచి ఆపరేషన్ చేయించు కోవడం, కేన్సర్ చికిత్సలో భాగంగా కీమోథెరపి చేయించడం, బక్కపలుచగా ఉండటం, శారీరక శ్రమ లేక పోవడం, రొమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్న వారిలోనూ బోలు వ్యాధి కనిపిస్తుంది. బోలు వ్యాధి ఉంటే తుంటి ఎముక, వెన్నుపూస, మణికట్టులు చిన్నచిన్న దెబ్బలకే విరిగి పోతుంటాయి. గతుకుల రోడ్లలో వేగంగా వెళ్లడం, సడన్‌గా బ్రేక్ వేసినప్పుడు ఎముకలు విరిగి పోతుంటాయి. బోలు ఎముకలు వల్ల తీవ్రంగా నీరసం వస్తుంది. విరిగిన వెన్నుపూస, ఎముకల వల్ల తీవ్ర నొప్పి, పెరుగుదల తగ్గడం, శరీరం వంగిపోవడం, నడవలేని పరిస్థితి, మనిషి కదలిక మందగించడం తదితరాలు. ఎముకల పటిష్టతకు కాల్షియం ఉండే ఆహార పదార్థాలతో పాటు మీగడ తీసిన పాలు, జున్ను తీసుకుంటే ఎంతో మేలు. ఉడక బెట్టిన బచ్చలికూర, బీన్స్, పచ్చి క్యాబేజీ, పచ్చి క్యారెట్, ఉడకబెట్టిన క్యాలీఫ్లవర్ తీసు కోవాలి. ఉడకబెట్టిన బెండ, బటానీలు, సోయాబీన్స్, ఉడక బెట్టిన పాలకూర, స్వీట్ పొటాటో తరచూ తీసుకోవాలి. ఖర్జూరం, కమలాలు, బొప్పాయి, బ్లాక్ బెర్రీలు తరచూ తీసుకోవాలి. బాదం పప్పు, ఎండబెట్టిన నువ్వులు, గుడ్లు తీసుకుంటే ఎముకల పటిష్టత పెరుగుతుంది. ప్రధానంగా జీవనశైలిలో తప్పనిసరిగా మార్పులు చేసుకోవాలి. వ్యాధిపై అవగాహన పెంచుకుని జాగ్రత్త పడాలి. వ్యాధికి గురి కాకుండా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. యువతీ యువకులు మద్యపానం, ధూమ పానానికి దూరంగా ఉండాలి. తక్కువ కొవ్వు పదార్ధాలు ఉండే ఆహార పదార్ధాలు తీసుకోవాలి. వ్యాధిగ్రస్థులు దృఢమైన ఎముకల కోసం, పగుళ్ల నివారణ కోసం కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్ధాలు తీసుకోవాలి. తృణ ధాన్యాలు కూడా ఎక్కువగా తీసుకోవాలి. ఎముకల సాంద్రత తగ్గిపోవడాన్ని నివారించే మందులు ప్రస్తుతం ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ఈస్ట్రోజన్, హార్మోన్ చికిత్సలు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఇంజక్షన్లతో పాటు మందులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. 45 ఏళ్లపైబడ్డ వారు తప్పనిసరిగా ఎముకల పరీక్ష చేయించు కోవాలి. చిన్నతనం నుంచే కాల్షియంతో కూడిన ఆహార పదార్ధాలు తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ఆహార నియమాలు తప్పని సరిగా పాటించాలి. వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు. వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు ఎముకల పటుత్వ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని త్వరగా గుర్తించి, చికిత్స చేయించు కోవాలి.




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# జాతీయ సెలక్షన్ కమిటీలో రమేశ్ పవార్

**సెలక్టర్‌గా మాజీ భారత స్పిన్నర్ నియామకం**

**కమిటీ చైర్మన్‌గా ప్రజ్ఞాన్ ఓజా కొనసాగింపు**

**2027 వన్డే ప్రపంచకప్ వరకు ప్రస్తుత కమిటీకి ప్రాధాన్యం**

బెంగళూరు: భారత పురుషుల సీనియర్ క్రికెట్ జాతీయ సెలక్షన్ కమిటీలో మాజీ స్పిన్నర్ రమేశ్ పవార్‌కు చోటు లభించింది. కమిటీ తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజా ఇకపై కూడా ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం ప్రకటించింది. గత చైర్మన్ అజిత్ అగార్కర్ పదవీకాలం అక్టోబర్ 4తో ముగియడంతో సెలక్షన్ కమిటీలో మార్పులు చేపట్టింది. రమేశ్ పవార్ నియామకాన్ని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ఏకగ్రీవంగా సిఫారసు చేసినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. మాజీ క్రికెటర్లు అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రజ్ఞాన్ ఓజా సెలక్షన్ కమిటీకి నేతృత్వం వహిస్తారని సైకియా తెలిపారు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు కమిటీలో కొనసాగింపునకు ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం.

### ఆటగాడిగా, కోచ్‌గా గుర్తింపు

48 ఏళ్ల రమేశ్ పవార్ భారత్ తరఫున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబయి తరఫున ఆడిన ఆయన 148 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 470 వికెట్లు పడగొట్టడంతోపాటు 4,245 పరుగులు సాధించారు. భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన సమయంలో 2022 ఆసియా కప్ టైటిల్, కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ముంబయి, గుజరాత్ జట్లకు కోచ్‌గా వ్యవహరించడంతోపాటు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ కోచ్‌గా సేవలందించారు.

### అగార్కర్ సేవలకు బీసీసీఐ ప్రశంసలు

కొత్త సెలక్టర్ ఎంపికలో భాగంగా అక్టోబర్ 15న ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో సలీల్ అంకోలా, వసీం జాఫర్, జాకబ్ మార్టిన్, కానర్ విలియమ్స్ కూడా పాల్గొన్నారు. చివరకు పవార్‌ను ఎంపిక చేశారు. 2023 జులైలో సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భారత క్రికెట్‌కు విశేష సేవలందించారని బీసీసీఐ ప్రశంసించింది. ఆయన పదవీకాలంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు, వరుసగా రెండు ఆసియా క్రీడల స్వర్ణ పతకాలు సాధించినట్లు పేర్కొంది. సెలక్షన్ కమిటీ సభ్యులు: ప్రజ్ఞాన్ ఓజా (చైర్మన్), శివ్ సుందర్ దాస్, ఆర్‌పీ సింగ్, అజయ్ రాత్రా, రమేశ్ పవార్.

# 27 స్థానాలు.. 146 మంది పోటీదారులు!

**మహిళల ప్రీమియర్ లీగ్ వేలానికి రంగం సిద్ధం**

**అక్టోబర్ 28న కొచ్చి వేదికగా ఆటగాళ్ల వేలం**

**కొచ్చి, అక్టోబర్ 19 :** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్ ) 2027 సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలానికి రంగం సిద్ధమైంది. అక్టోబర్ 28న సాయంత్రం 5:30 గంటలకు కేరళలోని కొచ్చిలో ఈ వేలం జరగనున్నట్లు ఆఫీసియల్గా పేర్కొన్నారు. ఈ వేలంలో ఫ్రాంచైజీల వద్ద ఖాళీగా ఉన్న 27 స్థానాలకు మొత్తం 146 మంది ప్లేయర్లు బరిలో ఉన్నారు. ఈ జాబితాలో 119 మంది భారతీయ ప్లేయర్లు ఉన్నారు. వీరిలో 22 మంది క్యాప్డ్, 97 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు. భారతీయుల కోసం మొత్తం 20 స్థానాలు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు 27 మంది విదేశీ ప్లేయర్లు వేలంలో పాల్గొంటున్నారు. వీరిలో 14 మంది క్యాప్డ్, 13 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు కాగా.. ఏడు విదేశీ ప్లేయర్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. విదేశీ జాబితాలో అసోసియేట్ దేశాలకు చెందిన ఆరుగురు ప్లేయర్లు కూడా ఉన్నారు. వేలంలో పలువురు స్టార్ ప్లేయర్లు తమ బేస్ ప్రైస్‌ను రూ.50 లక్షలుగా నిర్ణయించుకున్నారు. సోఫియా డంక్లీ, సోఫీ మోలినెక్స్ అత్యధిక బేస్ ప్రైస్‌తో జాబితాలో ఉన్నారు. ఇక కమలిని, కిరణ్ నవ్‌గిరే, హీథర్ గ్రాహమ్, జెస్ జొనాసెన్ రూ.40 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి రానున్నారు. మరో 30 మంది ప్లేయర్లు రూ.30 లక్షల బేస్ ప్రైస్‌ను ఎంచుకున్నారు. డబ్ల్యూపీఎల్ 2027 వేలం ఈ సైకిల్‌లో తొలి మినీ యాక్షన్ కానుంది. గతేడాది న్యూఢిల్లీలో జరిగిన మెగా వేలం తర్వాత ఫ్రాంచైజీలు తమ జట్లను పూర్తిగా పునర్వ్యవస్థీకరించుకున్నాయి. సెప్టెంబర్‌లోనే ఆయా జట్లు తమ రిటెన్షన్స్, రిలీజ్‌లను ఖరారు చేసుకుని మినీ వేలానికి సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు ముంబైలో రెండు, బెంగళూరులో ఒకటి, న్యూఢిల్లీలో ఒకటి చొప్పున డబ్ల్యూపీఎల్ వేలాలు జరిగాయి. ఇప్పుడు 2027 వేలం కొచ్చి వేదికగా జరగనుంది.




# తొలి రోజే 11 పతకాలు

**ఆసియా పారా క్రీడల్లో అదరగొట్టిన భారత్**

**నాలుగు స్వర్ణాలు, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు**

- పతకాల పట్టికలో నాలుగో స్థానం
- ఆర్చరీలో శీతల్ దేవి ప్రపంచ రికార్డు సమం
- టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలపై ఆశలు




**నగోయా:** ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల వేటను ఘనంగా ప్రారంభించారు. పోటీల తొలి రోజైన సోమవారం నాలుగు స్వర్ణాలు, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు కలిపి మొత్తం 11 పతకాలు సాధించారు. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. షూటింగ్, పారా అథ్లెటిక్స్, జూడో, స్విమ్మింగ్ విభాగాల్లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. ఆర్చరీలో శీతల్ దేవి వ్యక్తిగత విభాగంలో ప్రపంచ రికార్డును సమం చేయడంతోపాటు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 ఫైనల్లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా క్రీడల రికార్డు సృష్టించి స్వర్ణం గెలిచింది. ఆరో స్థానం నుంచి అద్భుతంగా పుంజుకున్న ఆమెను అధిగమించలేక రెండుసార్లు పారాలింపిక్స్ ఛాంపియన్ అవని లేఖరా 249.6 పాయింట్లతో రజతంతో సరిపెట్టుకుంది. ఈ ఫలితంతో 2028 లాస్‌ఏంజెలిస్ పారాలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌కు రెండో కోటా స్థానం లభించింది.

### అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణాలు

పారా అథ్లెటిక్స్‌లో భారత క్రీడాకారులు మూడు స్వర్ణాలు సాధించారు. పారాలింపిక్స్‌లో రెండుసార్లు రజత పతకాలు గెలిచిన నిషాద్ కుమార్ తొలిసారి అంతర్జాతీయ లాంగ్‌జంప్ పోటీలో పాల్గొని 7.11 మీటర్ల దూకుడుతో పసిడి కైవసం చేసుకున్నాడు. మహిళల 1500 మీటర్ల టీ12/టీ13 విభాగంలో సౌమ్య 5 నిమిషాల 12.39 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో స్వర్ణం సాధించింది. ఇదే విభాగంలో భారత్‌కే చెందిన వెంకటేశ్ రాధా రజతం గెలిచింది. పురుషుల ఎఫ్46 జావెలిన్ త్రోలో రింకు 65.11 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించగా, అజీత్ సింగ్ 65.02 మీటర్ల ప్రదర్శనతో రజతం దక్కించుకున్నాడు. ఇద్దరూ ఈ సీజన్‌లో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశారు. మహిళల టీ11 విభాగంలో రవన్నీ వలసనైనికి కాంస్య పతకం లభించింది.

### జూడోలో రజతం, కాంస్యం

దృష్టిలోపం ఉన్న క్రీడాకారుల జూడో పోటీల్లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిళల జే2, 52 కిలోల విభాగంలో కోకిల రజతం గెలిచింది. ఫైనల్లో కిర్గిజిస్థాన్‌కు చెందిన ఐబికే ఉలాన్‌బెక్ కిజీ చేతిలో ఓడింది. పురుషుల జే1, 70 కిలోల విభాగంలో కపిల్ పర్మార్ కాంస్య పతకం సాధించాడు. సెమీఫైనల్లో ఓటమి ఎదురైనా, కాంస్య పతక పోరులో ఇండోనేషియాకు చెందిన అహ్నాఫ్ రఫ్లీ షిద్కీపై 1-0తో విజయం సాధించాడు. పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 విభాగంలో రవి కార్తీక్ బుడిగిన 56.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక టేబుల్ టెన్నిస్‌లో మూడు విభాగాల్లో భారత క్రీడాకారిణులు సెమీఫైనల్‌కు చేరి పతకాలను ఖాయం చేసుకున్నారు. మహిళల క్లాస్-6లో ప్రాచీ పాండే, క్లాస్-3లో సోనల్‌బెన్, క్లాస్-4/5లో భవినా పటేల్ సెమీస్‌కు అర్హత సాధించారు. ప్రాచీ థాయ్‌లాండ్‌కు చెందిన కనోక్‌పోర్న్ ఫాథుమ్‌చాయ్‌ను, సోనల్‌బెన్ దరారత్ అసయుట్‌ను ఓడించారు. భవినా చైనాకు చెందిన ఝూంగ్ మియావోపై 3-1తో విజయం సాధించింది.

### బ్యాడ్మింటన్‌లోనూ ముందంజ

మిక్స్‌డ్ డబుల్స్‌లో నితేశ్ కుమార్-తులసీమతి మురుగేశన్ జోడీ గ్రూప్-బిలో వరుస విజయాలతో అజేయంగా నిలిచి సెమీఫైనల్‌కు చేరింది. దీంతో ఈ విభాగంలోనూ భారత్‌కు పతకం ఖాయమైంది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో పారాలింపిక్స్ ఛాంపియన్ నితేశ్ కుమార్ దక్షిణ కొరియాకు చెందిన జూ డోంగ్‌జేపై 21-13, 21-15తో గెలిచాడు. ఎస్‌యూ5 విభాగంలో రుతిక్ రఘుపతి థాయ్‌లాండ్‌కు చెందిన సోమ్‌సిరి ప్రిచాపై 21-12, 21-12తో విజయం సాధించాడు.

# భారత షట్లర్లకు సవాల్‌గా ఫ్రెంచ్ ఓపెన్

- నేటి నుంచి సూపర్ 750 టోర్నీ
- తొలి రౌండ్‌లో అగ్రశ్రేణి షట్లర్ అన్ సె యంగ్‌తో సింధు ఢీ
- లక్ష్యసేన్‌కు నరావోకాతో పోరు
- విజయాల బాట పట్టాలని సాత్విక్-చిరాగ్ జోడీ పట్టుదల





**పారిస్:** ఇటీవలి టోర్నీల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఫ్రెంచ్ ఓపెన్‌లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సూపర్ 750 టోర్నీలో మొత్తం 9.5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ అందుబాటులో ఉంది. పీవీ సింధు సహా భారత షట్లర్లు తమ ఆటతీరును మెరుగుపరుచుకొని కీలక విజయాలు సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు.

### సింధుకు అన్ సె యంగ్ సవాల్

రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. దక్షిణ కొరియాకు చెందిన టాప్ సీడ్ అన్ సె యంగ్‌తో ఆమె తలపడనుంది. గత డెన్మార్క్ ఓపెన్‌లోనూ వీరిద్దరి మధ్య మ్యాచ్ ఖరారైనప్పటికీ, సీడెడ్ క్రీడాకారులు చివరి నిమిషంలో తప్పుకోవడంతో డ్రా మారింది. దీంతో సింధు జర్మనీకి చెందిన యెవోన్ లీతో ఆడాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో సింధు తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. ఈసారి యంగ్‌ను ఎదుర్కొని ముందడుగు వేయాలంటే సింధు తన ప్రదర్శనను గణనీయంగా మెరుగుపరుచుకోవాల్సి ఉంటుంది.

### లక్ష్యసేన్‌కు పాత ప్రత్యర్థి

పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ లక్ష్యసేన్ జపాన్ ఆటగాడు కొడాయ్ నరావోకాతో తొలి రౌండ్‌లో తలపడనున్నాడు. వెన్నునొప్పి నుంచి కోలుకున్న లక్ష్యసేన్ ఆసియా క్రీడల్లో పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు కాంస్య పతకం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. గతంలో నరావోకాపై విజయం సాధించిన అతడు మరోసారి అదే ప్రత్యర్థిని ఎదుర్కోనున్నాడు. మాజీ ప్రపంచ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ కూడా మెరుగైన ప్రదర్శనతో తిరిగి పుంజుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఇటీవల ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అలెక్స్ లానియర్‌కు గట్టి పోటీ ఇచ్చిన శ్రీకాంత్.. ఈసారి భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టితో తలపడనున్నాడు.

### సాత్విక్-చిరాగ్ జోడీపై ఆశలు

పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీపై అందరి దృష్టి నెలకొంది. ఈ ఏడాది సింగపూర్, చైనా టోర్నీల్లో టైటిళ్లు సాధించిన ఈ జంట ఆసియా క్రీడల్లో అనూహ్యంగా ముందుగానే నిష్క్రమించింది. ఈ నిరాశను అధిగమించి తిరిగి విజయాల బాట పట్టాలని భావిస్తోంది. తొలి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పోపోవ్, తోమా జూనియర్ పోపోవ్ సోదరులతో తలపడనుంది. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారి కాంస్య పతకం సాధించిన మహిళల డబుల్స్ జోడీ త్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ కూడా బరిలోకి దిగనుంది. తైవాన్‌కు చెందిన లిన్ చిహ్-చున్, యాంగ్ చు-యున్ జోడీతో ఈ భారత జంట పోటీపడనుంది.

### మహిళల సింగిల్స్‌లో భారత పోరు

మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత క్రీడాకారిణులు పలు కీలక మ్యాచ్‌లు ఆడనున్నారు. తన్వి శర్మ, ఇషారాణి బారువా పరస్పరం తలపడనుండగా, అశ్మిత చలిహా చైనాకు చెందిన హాన్ కియాన్ షితో పోటీపడనుంది. ఉన్నతి హూడా జపాన్ క్రీడాకారిణి రికో గుంజీని ఎదుర్కోనుంది. దేవికా సిహాగ్‌కు ఇండోనేషియాకు చెందిన ఐదో సీడ్ పుత్రి కుసుమ వార్దానీ ప్రత్యర్థిగా నిలవనుంది.

# సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ

**హిమాచల్‌పై ముంబై 258 పరుగుల ఆధిక్యం**

**నిషాంత్ సింధు ఆల్‌రౌండ్ షో.. రెండు రోజుల్లోనే హర్యానా ఘన విజయం**

**బిలాస్‌పూర్/రోహ్‌తక్:** రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌ల్లో ముంబై, హర్యానా జట్లు సత్తాచాటాయి. హిమాచల్‌ప్రదేశ్‌పై ముంబై భారీ ఆధిక్యంతో దూసుకెళ్తుండగా.. చండీగఢ్‌పై హర్యానా ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హర్యానా ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలగా.. ముంబై రెండో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లకు 398 పరుగులు చేసింది. సర్ఫరాజ్ ఖాన్ 213 బంతుల్లో 18 ఫోర్లతో 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆకాష్ ఆనంద్ 58 పరుగులతో అతడికి అండగా నిలిచాడు. ఐదో వికెట్‌కు వీరిద్దరూ అజేయంగా 176 పరుగులు జోడించారు. దీంతో ముంబయికి 258 పరుగుల ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 12 పరుగులతో ఆట కొనసాగించిన కెప్టెన్ సిద్ధేశ్ లాడ్ 87 పరుగులు చేసి ఔటయ్యాడు. ముషీర్ ఖాన్ 57 పరుగులు సాధించాడు. సోమవారం ముంబయి 87 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 291 పరుగులు జోడించింది. హిమాచల్ బౌలర్లలో అభిషేక్ కుమార్, జితేందర్ రాణా రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తుషార్ దేశ్‌పాండే నాలుగు వికెట్లతో హిమాచల్‌ను దెబ్బతీశాడు.

### సింధు ఆల్‌రౌండ్ ప్రదర్శన

రోహ్‌తక్‌లో చండీగఢ్‌పై హర్యానా ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత చండీగఢ్ 103 పరుగులకు ఆలౌటైంది. అనంతరం హర్యానా తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. నిషాంత్ సింధు 92, యశ్‌వర్ధన్ దలాల్ 95 పరుగులతో రాణించారు. దీంతో హర్యానాకు 142 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో చండీగఢ్ 118 పరుగులకే పరిమితమైంది. ఎడమచేతి వాటం స్పిన్నర్ నిషాంత్ సింధు 27 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. కనిష్క్ చౌహాన్ మూడు వికెట్లు తీశాడు. చండీగఢ్ కెప్టెన్ మన్‌దీప్ వోహ్రా 47 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసింది. ప్రదోష్ రంజన్ పాల్ 136, బాబా ఇంద్రజిత్ 77 పరుగులు సాధించారు. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకు ఆలౌటై, రెండో ఇన్నింగ్స్‌లో ఏడు ఓవర్లకు వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. మయాంక్ మిశ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు.



జైపూర్‌లో రాజస్థాన్ 497 పరుగుల భారీ స్కోరు సాధించింది. సచిన్ యాదవ్, కరణ్ లాంబా చెరో 194 పరుగులు చేశారు. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్‌కు 46 పరుగులు చేసింది.

# నన్నే ఎందుకు టార్గెట్ చేశారు?



కాల్పుల ఘటనతో బాలీవుడ్‌లో కలకలం

**ముంబై, అక్టోబర్ 19 :** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగినట్లు వెలువడిన వార్తలు సినీ పరిశ్రమలో కలకలం రేపుతున్నాయి. తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో అర్థం కావడం లేదని, తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని టైగర్ ష్రాఫ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేతో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించినట్లు సమాచారం. గతంలో తనకు ఎలాంటి బెదిరింపులు రాలేదని, ఎవరితోనూ వ్యక్తిగత వివాదాలు లేవని చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాల్పుల ఘటన నేపథ్యంలో తనను లక్ష్యంగా చేసుకోవాల్సిన అవసరం ఎవరికుందో తెలియడం లేదని టైగర్ ష్రాఫ్ పేర్కొన్నట్లు సమాచారం. తనకు గతంలో ఎలాంటి బెదిరింపు సందేశాలు అందలేదని, ఎవరితోనూ శత్రుత్వం లేదని శిందేకు వివరించినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో గానీ, నటుడు సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన వివాదాలతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారన్న విషయం అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. సాధారణంగా వారాంతాల్లో ఫుట్‌బాల్ ఆడిన అనంతరం అభిమానులతో ఫొటోలు దిగడం టైగర్ ష్రాఫ్‌కు అలవాటని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఆదివారం ఫుట్‌బాల్ ఆడిన తర్వాత అలసటగా అనిపించడంతో అభిమానులతో ఫొటోలు దిగకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. ఆ రోజు తీసుకున్న నిర్ణయం తనను ప్రమాదం నుంచి తప్పించి ఉండవచ్చని శిందేతో చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ అంశానికి కాల్పుల ఘటనతో ఉన్న సంబంధంపై అధికారిక దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది. కాల్పుల ఘటన అనంతరం ఆదివారం రాత్రి టైగర్ ష్రాఫ్‌ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే పరామర్శించినట్లు కథనాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా నటుడితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నట్లు సమాచారం. టైగర్ ష్రాఫ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని శిందే హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భద్రత విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నాయి. టైగర్ ష్రాఫ్ భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఆయనకు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు నివాసం వద్ద పోలీసు బందోబస్తును పెంచే విషయంపై చర్యలు తీసుకోనున్నట్లు శిందే వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. కాల్పుల ఘటనకు సంబంధించి అనుమానితులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే నిందితుల వివరాలు, ఘటన వెనుక కారణాలు, దర్యాప్తులో వెల్లడైన అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. కాల్పులకు పాల్పడిన వారి ఉద్దేశం ఏమిటి? టైగర్ ష్రాఫ్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? ఈ ఘటన వెనుక ఏదైనా ముఠా ప్రమేయం ఉందా? అనే ప్రశ్నలకు దర్యాప్తులో సమాధానాలు లభించాల్సి ఉంది.



# కీర్తి సురేష్ సినిమాపై మహేష్ బాబు ఫ్యాన్స్ ఫైర్..

పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్, ఇప్పుడు గేర్ మార్చి వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. కేవలం రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, మొన్నటికి మొన్న నాని 'ది ప్యారడైజ్'లో స్పెషల్ సాంగ్‌తో దుమ్ములేపిన ఈ ముద్దుగుమ్మ, అటు 'డోరతీ'లో కాసేపే కనిపించినా ఇంపాక్ట్ చూపించింది. ఇక త్వరలోనే 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో నెవర్ బిఫోర్ లేడీ గ్యాంగ్‌స్టర్ అవతారంలో అక్టోబర్ 30న నెట్‌ఫ్లిక్స్‌లో పలకరించబోతోంది. అయితే ఇవన్నీ ఒకెత్తయితే.. నవంబర్ 20న థియేటర్లలోకి రాబోతున్న ఆమె తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి' చుట్టూ ఇప్పుడు టాలీవుడ్‌లో ఓ సరికొత్త వివాదం రాజుకుంది. ఈ సినిమా టీజర్ బయటకు వచ్చాక సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయం ఏంటంటే.. సినిమా జులైలోనే రావాల్సి ఉండగా నవంబర్‌కు వాయిదా పడింది. ఈ లేట్ రిలీజ్‌పై వచ్చే ట్రోల్స్‌కు కౌంటర్ ఇచ్చేలా టీజర్‌లో పోకిరి సినిమాలోని ఫేమస్ డైలాగ్ "ఎప్పుడు వచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా లేదా!" అనే పవర్‌ఫుల్ డైలాగ్‌ను తెలుగు టీజర్‌లో వాడారు. అయితే మాట మహేష్ బాబుది పెట్టి, విజువల్స్‌లో మాత్రం కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ సీన్‌ను చూపించడం మనోళ్లకు ఏమాత్రం మింగుడుపడటం లేదు. మాట ఆయనది వాడినప్పుడు మహేష్‌ను ఎందుకు చూపించలేదంటూ సోషల్ మీడియాలో మహేష్ ఫ్యాన్స్ మేకర్స్‌పై గుర్రుమంటున్నారు. టైటిల్‌తో పాటు సినిమా మొత్తం తమిళ వాసనలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్న విమర్శలూ వస్తున్నాయి. దర్శకుడు మిస్కిన్ కీలక పాత్రలో, కీర్తి సురేష్ లాయర్‌గా నటిస్తున్న ఈ కోర్ట్ రూమ్ డ్రామాకు బాక్సాఫీస్ వద్ద అంత ఈజీగా దారి దొరికేలా లేదు. నవంబర్ 20న అటు తెలుగు, ఇటు తమిళంలో ఇద్దరు క్రేజీ హీరోలతో కీర్తి నేరుగా తలపడాల్సి వస్తోంది. ధనుష్ నటిస్తున్న 'ఓం', దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రాలు కూడా సరిగ్గా అదే రోజున థియేటర్లలోకి దిగుతున్నాయి. అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో ఈ ఇద్దరు స్టార్ల చిత్రాల నుంచి భారీ పోటీని తట్టుకుని కీర్తి సురేష్ తన 'సావిత్రి'తో ఏ మేరకు విజయం సాధిస్తుందో చూడాలి.

# భక్తి విశ్వాసాల కనకదుర్గ



అల్లరి నరేశ్, కాజల్ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త సినిమా 'కనకదుర్గ'. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బీవీఎస్ రవి కథను అందించారు. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ పతాకాలపై అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి నిర్మిస్తున్నారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఈ చిత్రం నుంచి తొలి పాట 'అమ్మ కనకదుర్గ'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను తమన్ స్వరపర్చగా, సిరాశ్రీ సాహిత్యం అందించారు. ఈ గీతావిష్కరణ కార్యక్రమంలో హీరో అల్లరి నరేశ్ మాట్లాడుతూ.. "నేను తొలిసారి ఈ భక్తిరస చిత్రంలో నటిస్తున్నా. సినిమా షూటింగ్ పూర్తయింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం" అన్నారు. నిర్మాతలు అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి మాట్లాడుతూ.. "భక్తి విశ్వాసాల నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పాట విడుదల ఒక అర్థవంతమైన తొలి అడుగు" అని చెప్పారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. "ఈ పాట కేవలం ఓ సంగీత రచనలా కాకుండా.. భక్తుడు అమ్మవారిని ప్రార్థించే సమయంలో కలిగే గాఢమైన భావోద్వేగాన్ని, అమ్మవారి అపారమైన శక్తిని, కరుణను ప్రతిబింబించేలా ఉండాలని కోరుకున్నా" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిర్లా స్టూడియోస్ సహ నిర్మాత సునీల్ చైనాని, జీ మ్యూజిక్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సుజల్ పరేఖ్ పాల్గొన్నారు.



# గులాబీ లెహంగాలో గ్లామరస్‌గా

టాలీవుడ్ అందాల భామ హెబ్బా పటేల్ గులాబీ వర్ణపు లెహంగాలో అత్యంత గ్లామరస్‌గా మెరిసిపోయారు. ఎప్పటికప్పుడు సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌తో అలరించే ఈ బ్యూటీ, నవరాత్రుల శుభసమర్భంలో సంప్రదాయ దుస్తులు ధరించి తనదైన స్టైలిష్ గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. 'కుమారి 21ఫ్' చిత్రంతో యూత్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న హెబ్బా పటేల్, ఈ ఫోటోషూట్‌లో పింక్ కలర్ డిజైనర్ లెహంగాలో ఎంతో అందంగా కనిపించారు. బ్లౌజ్‌పై ఉన్న గోల్డెన్ వర్క్, చేతుల డిజైన్లు డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణ తెచ్చిపెట్టగా, పెద్ద చెవిపోగులు, పాపిట బిళ్ల, గాజులు ఆమె గ్లామరస్ లుక్‌కు మరింత శోభను చేకూర్చాయి. ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్‌లో ఆమె ఇచ్చిన ప్రత్యేక పోజులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా పండుగల సమయంలో హీరోయిన్లు సంప్రదాయ కట్టుబొట్టులో కనిపించడం సహజమే అయినప్పటికీ, హెబ్బా పటేల్ సంప్రదాయాన్ని పాటిస్తూనే ఎంతో గ్లామరస్‌గా కనిపించడం విశేషం. దీంతో ఆమె ఫొటోలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు' వంటి హిట్ చిత్రాల్లో నటించిన హెబ్బా, త్వరలోనే 'రుద్ర కాల', 'రామరస' వంటి ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. పండుగ వేళ హెబ్బా పటేల్ పంచుకున్న ఈ గ్లామరస్ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# మాధురి రాథోడ్.. మళ్లీ దుమ్ము దులిపేసిందిగా




ఇటీవల వరుస వివాదాలతో టాక్ ఆఫ్ ది మీడియాగా నిలిచిన ప్రముఖ ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. అయితే ఈ సారి వైరల్ న్యూస్‌తో కాదు. తాను నూతనంగా నర్తించిన జానపద గీతం భామ సుందరాలో తాజాగా యూ ట్యూబ్‌లో విడుదలై విజయవంతంగా దూసుకెళుతుంది. అయితే ఈ పాటలో తరుచూ కనిపించే తన ప్రియుడు సాయితో కాకుండా వెంకట్ అజ్మీరాతో కలిసి ఆడి పాడింది. దసరా పర్వదినాన్ని పురష్కరించుకుని సోమవారం రిలీజ్ అయిన ఈ పాట కొద్ది సమయంలోనే మిలియన్‌కు పైగా వ్యూస్ రాబట్టి యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. దివంగత రామస్వామి సాహిత్యం అందించిన ఈ గేయానికి నటుడు వెంకట్ అజ్మీరానే స్వయంగా సంగీతం అందించగా శేఖర్ వైరస్ నృత్యరీతులు సమకూర్చాడు. నరసింహులు, ముకుంద ఆలపించారు. పాటలోని సాహిత్యానికి తోడు మాధురి డ్యాన్స్ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇంకెందుకు ఆలస్యం మీరూ ఈ పాటపై ఓ లుక్ వేయండి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com